



# ప్రజావీక్షణం

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

PJV ప్రజా వీక్షణం టీవీ

Subscribe

www.prajaveekshanam.in సంపుటి:16 సంచిక :205 19 శుక్రవారం, జూన్ 2026 పేజీలు : 12 వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari


## వానాకాలం సాగుకు రైతులకు అండగా ప్రభుత్వం

- 30న రైతు భరోసా నిధులు విడుదల
- మధిర వేదికగా సిఎం రేవంత్ చేతుల మీదుగా అందచేత
- ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం
- ధ ఆన్యం కొనుగోళ్లలో కేంద్రం తీరుపై ఆగ్రహం
- కేబినేట్ భేటీలో పలు అంశాలపై చర్చ
- వివరాలు వెల్లడించిన మంత్రి ఉత్తమ్ కుమార్

హైదరాబాద్,జూన్18 (ప్రజా వీక్షణం)

ఈనెల 30వ తేదీన రైతు భరోసా నిధులు విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశమైంది. ఈ సమావేశంలో ఈ మేరకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. వరుసగా తొమ్మిది రోజుల పాటు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం ఈ నిధులను జమ చేయనుంది.30న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మధిరలో నిర్వహించే సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు.

మిగతా 2 లో



## నేను జైల్లో ఉన్నప్పుడు.. బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేయాలనుకున్నారు - కవిత

- గులాబీ బాస్‌లపై సంచలన ఆరోపణలు చేసిన కవిత
- తాను జైల్లో ఉన్నప్పుడు కొందరు నేతలు తన వద్దకు వచ్చారన్న కవిత- ఆ ప్రతిపాదనను తాను తీవ్రంగా వ్యతిరేకించానన్న కవిత

(ప్రజా వీక్షణం)

పార్టీ కోసం ప్రాణాలు త్యాగం చేయడానికి కూడా సిద్ధపడ్డానని వెల్లడి తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ప్రకంపనలు మొదలయ్యాయి.



వివరాలు 2లో

## పార్టీ లైన్ దాటితే క్షమించేది లేదు

- ఎంతటి వారైనా పార్టీకి కట్టుబడి ఉండాల్సిందే
- క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి

హైదరాబాద్,జూన్18 (ప్రజా వీక్షణం)

ఎంతటి వారైనా సరే వారి వ్యక్తిగత సమస్యలను పార్టీపై రుద్ద వద్దని నేతలకు క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు. మీకు ఏమైనా సమస్యలు ఉంటే..



వివరాలు 2లో



## రికార్డు ధర పలికిన హైదరాబాద్ భూములపై న్యాయ వివాదం

- ఎస్బీఐ పిటిషన్‌తో వేలానికి బ్రేక్

(ప్రజా వీక్షణం)

హైదరాబాద్ నగరంలోని రాయదుర్గంలో ఇటీవల రికార్డు ధర పలికిన అత్యంత ఖరీదైన భూముల వేలం ప్రక్రియపై తెలంగాణ హైకోర్టు మధ్యంతర స్టే విధించింది. వేలం వేసిన భూమిలో కొంత భాగం తమదేనంటూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) దాఖలు చేసిన పిటిషన్‌తో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది.

## ఈ-కేబినెట్ విధానానికి తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్



- ప్రస్తుతం ఉత్తరాఖండ్ లో అమలులో ఉన్న ఈ-కేబినెట్ విధానం
- ఈ విధానం కోసం రూ. 2 కోట్ల వ్యయంతో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తున్న వైనం
- ట్యాబ్‌లు, కంప్యూటర్ల ద్వారా ఎజెండాలు, ఫైల్స్ పరిశీలించే వెసులుబాటు

(ప్రజా వీక్షణం)

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. క్యాబినెట్ సమావేశాలను డిజిటల్ విధానంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రతిపాదనకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ఈ విధానం అమలు కోసం రూ.2 కోట్ల వ్యయంతో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం ఉత్తరాఖండ్ రాష్ట్రంలో అమలులో ఉన్న క్యాబినెట్ డిజిటల్ విధానాన్ని తెలంగాణ అవసరాలకు అనుగుణంగా మార్పులు చేసి అమలు చేయనున్నారు.



## ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త

- 11శాతం ఫిట్‌మెంట్ అమలుకు నిర్ణయం
- జూలై 1 నుంచే అమలు చేస్తామన్న మంత్రి పొన్నం

2 లో

## ఆక్వా ఫీడ్ ధరలు తగ్గించాలి

- కిలో ధర 4 వరకు తగ్గించిన వ్యాపారులు
- సిఎంతో ఆక్వా ఫీడ్ వ్యాపారుల భేటీ
- ఆక్వా, టొబాకో, మామిడి రైతుల సమస్యలపై
- చంద్రబాబు సమీక్ష

అమరావతి,జూన్18 (ప్రజా వీక్షణం)

ఆక్వా ఫీడ్ ధర తగ్గించాలని తయారీదారులను సీఎం చంద్రబాబు నాయుడు కోరడంతో వారు సానుకూలంగా స్పందించారు. దీంతో ఆక్వా రైతులు హర్షం వ్యక్తం చేశారు.

వివరాలు 2లో



## వేర్వేరు ప్రమాదాల్లో 8మంది మృతి

- నెత్తురోడిన రాష్ట్ర రహదారులు- మేడ్చెల్ వద్ద ప్రమాదంలో ముగ్గురు మృతి
- వరంగల్ రహదారి ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

హైదరాబాద్,జూన్18 (ప్రజా వీక్షణం)

రాష్ట్రంలోని రహదారులు నెత్తురోడాయి. వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి చెందారు. హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారిపై మినీ ట్రక్కును లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు.

## నిరుద్యోగలును మోసం చేసిన రేవంత్

- ఉద్యోగాల పేరుతో ఆశపెట్టి చేతులెత్తారు- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

వరంగల్,జూన్18 (ప్రజా వీక్షణం)



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలే లక్ష్యంగా పోటీ పరీక్షలకు సన్నదమవుతున్న విద్యార్థి, నిరుద్యోగులను ఉద్యోగార్థులుగా తీర్చిదిద్దేందుకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి చే ప్రత్యేకంగా రూపొందించిన యాపస్‌ను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, గండ్ర రమణా రెడ్డి చేతుల మీదుగా హన్మకొండలోని అంబేద్కర్ భవన్ లో ఆవిష్కరించారు.

## యూరియా యాప్ తొలగించాల్సిందే

- బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ వేముల ప్రశాంత్ రెడ్డి

నిజామాబాద్,జూన్18 (ప్రజా వీక్షణం)

యూరియా యాప్‌ను తక్షణం తొలగించాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా వేల్పూర్ ఎక్స్ రోడ్డు వద్ద బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆందోళనకు దిగారు. రైతులు, గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున ఈ నిరసన కార్యక్రమానికి హాజరయ్యారు. మాజీ మంత్రి నేతృత్వంలో జాతీయ రహదారిపై నేతలంతా కలిసి బైఠాయించారు.



ప్రజావీక్షణం దినపత్రిక



ప్రజావీక్షణం దినపత్రిక



ఎడిటర్: కె. శ్రావణ్ కుమార్


## సంపాదకీయం

# విద్యారంగంలో మార్పులు కావాలి !

తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభం ఒక గొప్ప ముందడుగనే చెప్పాలి. అందరికీ విద్య అన్నది ప్రభుత్వ పరంగా చేపట్టడం ఆహ్వానించదగ్గ విషయం. విద్య,వైద్యం విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటే ఓ ఐదేళ్లలో గణనీయమైన మార్పులు తీసుకుని రావచ్చు. గ్రామస్థాయి వరకు ప్రాథమిక విద్య, ప్రాథమిక వైద్యం అందితే ప్రజలకు అంతకు మించి కావాల్సింది లేదు. కులాలు, మతాల వారీగా హాస్టళ్లు, స్కూళ్ల వల్ల సమాజంలో అసమానతలు పెరిగాయి. ఇదే విషయాన్ని పదేపదే ప్రస్తావిస్తున్న సిఎం రేవంత్ ఓ మంచి అడుగు వేశారనే చెప్పాలి. అయితే ఇదొక్కటే సరిపోదు. రేవంత్ రెడ్డి పదవీ కాలంలో రెండున్నరేళ్లు పూర్తయ్యాయి. ఇంకా రెండేళ్ల పదవీకాలం మాత్రమే ఉంది. కనీసం ఉన్న స్కూళ్లనయినా బాగుచేసి, హాస్టళ్లను స్కూళ్లకు అనుసంధానం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టాలి. కెసిఆర్ హయాంలో కెజి టూ పిజి అని ప్రగల్భాలు పలికారు. కానీ దానిని ఏనాడు పట్టాలకు ఎక్కించలేక పోయారు. ఆనాడే చేసివుంటే పదేళ్లలతో తెలంగాణ విద్యావ్యవస్థ రూపురేఖలు మారి ఉండేవి. ఇప్పటికైనా కామన్ విద్యావిధానం తీసుకుని రావాలి. అందరికీ ఒకేచోట విద్యను తీసుకుని వస్తే ప్రైవేట్ స్కూళ్ల దోపిడీ కూడా తగ్గుంది. గ్రామాల్లో కూడా సామాన్య జనం నేటికీ అప్పులు చేసి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారు. దీనిని తక్షణం నిరోధించాలి. ఈ దోపిడీని అరికట్టాలి. స్కూళ్లను అభివృద్ధి చేయడం వల్ల సమాజాంలో కులాల మధ్య అంతరాన్ని తొలగించడంతో పాటు, కుటుంబాల ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దవచ్చు. ప్రైవేట్ దోపిడీని అరికట్టవచ్చు. అలాగే ఏకీకృత విద్యకు కృషి చేయాలి. విద్యా వివక్షను రూపుమాపాలంటే కామన్ స్కూల్ విధానం వెంటనే అమలు చేయాల్సి ఉంది. తెలంగాణ పబ్లిక్ స్కూల్ కాన్సెప్ట్‌ను సిఎం తప్పనిసరిగా అమలు చేయగలిగితే అతిపెద్ద విజయం సాధించినట్లుగా చెప్పవచ్చు. అలా కాకుండా తెలంగాణ పబ్లిక్ స్కూల్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పేరుతో ప్రభుత్వం ఎన్ని సంస్కరణలు ప్రవేశపెట్టినా లాభం ఉండదు. ఎంతగా డబ్బులు ఖర్చు చేసినా అత్యధిక విద్యార్థులున్న ప్రైవేటు విద్యా సంస్థలను నియంత్రించకుండా, ప్రభుత్వ బడులను సంస్కరించకుండా ముందుకు సాగితే సత్ఫలితాలు సాధించలేం. ప్రభుత్వ బడికి గతంలో ఉన్న ఇమేజ్ తీసుకుని రావాలంటే ప్రైవేటుకు దీటుగా ఉన్నాయన్న భరోసా కల్పించాలి. అందుకు గట్టి కృషి చేయాలి. నాణ్యమైన ఉచిత విద్య ప్రభుత్వ బడిలో దొరుకుతుందనే గట్టి నమ్మకం మాత్రమే ప్రభుత్వ విద్యా సంస్థలలో నమోదు పెంచుతుంది. కాబట్టి పాలకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే గ్రామాల వారీగా ఏకీకృత కామన్ పాఠశాల వ్యవస్థకు రూపకల్పన చేయాలి. అంతేగాక ఇబ్బడి ముబ్బడిగా కనీస వసతులు లేకుండా నడుస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలను నిషేధించాలి. లేదా నియంత్రణ చర్యలు చేపట్టాలి. ఇలా చేయగలిగితే సిఎం రేవంత్ ర ఎడ్డి ఆశించిన ఫలితాలు వస్తాయి. అంతరాలు లేని శాస్త్రీయ విద్య అందరికీ అందుబాటులోకి వస్తుంది. కామన్ స్కూల్ విధానం మాత్రమే ప్రజలకు ఏకైక విద్యా ప్రత్యామ్నాయంగా గుర్తించి ముందుకు సాగేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానం దోహదపడుతుంది. గ్రామాల్లో నర్సరీ నుంచి ఇంటర్ వరకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఒకే స్కూల్ ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలి. తెలుగు మీడియం అయినా ఆంగ్లబోధనను కూడా తప్పనిసరి చేయాలి. స్పోకెన్ ఇంగ్లీష్‌తో దీన్ని అధిగమించవచ్చు. ఇప్పుడు విద్యారంగానికి ఖర్చు చేస్తున్న నిధులతోనే ఏకీకృత విద్యను అందుబాటులోకి తీసుకుని రావచ్చు. గ్రామస్థాయి నుంచి పట్టణస్థాయి వరకు అందరి పిల్లలు ఒకే పాఠశాలలో చదువుకునే ఏకీకృత విధానం అమలు కావాలి. అక్కడే విద్యార్థులు బ్రేక్ ఫాస్ట్ మొదలు, మధ్యాహ్న భోజనం అందించాలి. ఇంటి నుంచి పిల్లలు స్కూలుకు వచ్చేలా అవసరమైతే ట్రాన్స్‌పోర్టు కూడా ఏర్పాటు చేయాలి. ఇది కుల, మత వైషమ్యాలు లేని విద్యా వ్యవస్థకు పునాది వేయగలదు. ఒక మండల కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ లాంటి స్కూల్ ఉంటే ఆ చుట్టుపక్కల విద్యార్థులంతా స్కూల్ బస్సుల్లో వచ్చి పోయేలా సౌకర్యాలు కల్పించాలి. దీనివల్ల పిల్లలు తల్లిదండ్రుల సమక్షంలోనే పెరగగలరు. హాస్టళ్లలో పడి బాల్యం కోల్పోకుండా చూడగలం. తల్లిదండ్రుల అజమాయిషీలో వారికి ఖర్చు లేకుండా అంతా ప్రభుత్వ కనుసన్నల్లో విద్యను నేర్చుకోగలరు. ఇలా కిలోమీటరు నుంచి ఐదు కిలోమీటలర్ పరిధి వరకు పిల్లలకు స్కూలును అందుబాటులోకి తీసుకుని రావడం ద్వారా సంక్షేమ హాస్టళ్ల బాధ తప్పుతుంది. ఇకపోతే ప్రత్యేక అవసరాలు గల మూగ, బధిర, అంధ బాలలకు మాత్రం ప్రత్యేకంగా పాఠశాలలను ఏర్పాటు చేసి, దానికి అనుబంధంగా మాత్రం హాస్టళ్లను కొనసాగించాలి. మానసిక ఎదుగుదల లేని పిల్లలు ప్రత్యేక అవసరాలు గల పిల్లలుగా గుర్తించినా, వారిని తల్లిదండ్రుల ప్రత్యేక పర్యవేక్షణ కిందనే ఉంచి, పాఠశాలల వసతులను కల్పించాలి. అభివృద్ధి చెందిన అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో సైతం ఏకీకృత పాఠశాల వ్యవస్థ ప్రభుత్వ రంగంలోనే విస్తృతంగా అభివృద్ధి చెందింది. మన దేశంలో నియంత్రణ, నియమాలు లేకుండా విచ్చలవిడిగా ప్రైవేటు పాఠశాల వ్యవస్థను అనుమతించడం వల్ల విద్యావ్యవస్థ వెర్రితలలు వేసింది. అవసరాలకు మించి ప్రైవేటు పాఠశాలల ఏర్పాటుతో ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ దెబ్బ తింటోంది. తెలంగాణలో ఇప్పటికే నాలుగు వేల పాఠశాలలు మూతపడ్డాయని అంటున్నారు. 19లక్షల విద్యార్థులు ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతుంటే, 36లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు విద్యా సంస్థలలో చదువుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మనకు ఇంగ్లీష్ లేనిదే ముద్ద దిగదు. సామాన్యులు కూడా తమ పిల్లలు ఇంగ్లీషులో మాట్లాడాలని అనుకుంటారు. అందుకు ప్రభుత్వ స్కూళ్లలో స్పోకెన్ ఇంగ్లీష్ తప్పనిసరి చేయాలి. ఎల్‌కెజి నుంచే అది మొదలు కావాలి.

# వానాకాలం సాగుకు రైతులకు అండగా ప్రభుత్వం


మొదటిపేజీ తరువాయి


రైతు భరోసా కింద రైతులకు ప్రభుత్వం ఏటా ఎకరానికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ పెట్టుబడి సాయాన్ని రెండు పంటల కాలాలకు ఖరీఫ్, రబీ కాలంలో విడగొట్టి, ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ. 6,000 చొప్పున నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. మరోవైపు.. 23వ ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం సంబంధిత నిధులను కేంద్రం ఈ నెల 20న విడుదల చేయనుంది. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో ఒక్కో రైతు ఖాతాలో రూ. 2 వేలు చొప్పున నగదు జమ కానుంది. దీంతో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు 10 రోజుల తేడాతో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నాయి. సచివాలయంలో మంత్రులతో ప్రత్యేకంగా నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై సీఎం చర్చించారు. హైదరాబాద్ మెట్రో రైలు, ధాన్యం కొనుగోళ్లు, వీబీజీ రాంజీ పథకం, కేంద్ర ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై మంత్రులతో చర్చలు జరిపారు. వానాకాలం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నామని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. జూన్ 30వ తేదీన మధిరలో రైతు సమ్మేళనం పేరిట నిర్వహించే బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులు విడుదల చేస్తారని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్ల సమావేశంలో వివరించారు. ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. మార్కెట్లో వాటికి ఉన్న డిమాండ్ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మన రాష్ట్రం నుంచి కేంద్రం తక్కువ ధాన్యం సేకరించడంపై ఈ సమావేశంలో ఆందోళన వ్యక్తమైందని పేర్కొన్నారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని డిమాండ్ చేశామని తెలిపారు. కేంద్రం కనీస మద్దతు ధర ఇచ్చి కొనే ధాన్యాన్ని మాత్రమే తెలంగాణ కొనాలని నిర్ణయించామన్నారు. ఎరువుల కోటాను వెంటనే విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై పలుమార్లు కేంద్రానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖలు రాశారని గుర్తు చేశారు. త్వరలో ఢిల్లీకి వెళ్లి ఆయా అంశాలను కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించామన్నారు. రామగుండంలో తయారయ్యే యూరియాలో అత్యధిక శాతాన్ని తెలంగాణకే కేటాయించాలని కేంద్రానికి స్పష్టం చేశారు. అలాగే హైదరాబాద్ మెట్రో విస్తరణకు కూడా సహకరించాలని కేంద్రాన్ని కోరారు. అందుకు మెట్రో రెండో దశకు అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఐఆర్ఎఫ్‌సీ నుంచి రావాల్సిన రుణాన్ని వెంటనే విడుదల చేయించాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి అడ్డంకులు లేకుండా ప్రాజెక్టుల అనుమతులు ఇప్పించడానికి కలిసి రావాలని బీజేపీ ఎంపీలకు ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ పిలుపునిచ్చారు. ఇకపై డిజిటల్ క్యాబినెట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. జూన్ 21వ తేదీన జరిగే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఈ కేబినెట్ భేటీలో నిర్ణయించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇక వీబీ- జీ ఆర్ఏఎం జీ పై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సబ్ కమిటీలో మంత్రులు సీతక్క, తుమ్మల, ఉత్తమ్ ఉంటారు. దీనిపై ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం తర్వాత.. జూన్ 25 లోపు ప్రభుత్వానికి కేబినెట్ సబ్ కమిటీ నివేదిక అందజేయనుందని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.

# ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త


మొదటిపేజీ తరువాయి


హైదరాబాద్,జూన్18 (ప్రజా వీక్షణం)



తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభవార్త చెప్పారు. ఆర్టీసీ సమ్మెలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు జులై 1 నుంచి 11 శాతం ఫిట్‌మెంట్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం టీజీఎస్‌ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్, పెద్దపల్లి బస్ డిపో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వేములవాడ, కథలాపూర్ బస్ స్టేషన్లకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. హుజూర్‌నగర్, కోదాడ, నాగర్‌కర్నూల్ బస్ స్టేషన్లకు కూడా మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ములుగు బస్ స్టేషన్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మహాలక్ష్మీ పథకంపై ప్రత్యేక అధ్యయనం చేయాలని సూచించారు. మహిళా సంఘాలకు చెందిన 553 బస్సుల పనితీరుపై మంత్రి నివేదిక కోరారు. రాష్ట్రంలో 1,050 ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణపై సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. ఆర్టీసీ వద్ద 10,173 బస్సులు.. 38,128 మంది ఉద్యోగులు ఉన్నారని, రోజుకు 61 లక్షల మంది ప్రయాణికులు టీజీఎస్‌ఆర్టీసీ సేవలు పొందుతున్నట్లు తెలిపారు. పెండింగ్ కారుణ్య నియామకాలను వెంటనే పూర్తి చేయాలని అధికారులను పొన్నం ఆదేశించారు. తొలగించిన ఉద్యోగుల్లో 244 మందికి ఇప్పటికే విధుల్లోకి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. ఉద్యోగి శంకర్ కుటుంబానికి రూ.1 కోటి చెక్కును ఆర్టీసీ అందజేయనున్నట్లు తెలిపారు. శంకర్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినట్లు చెప్పారు. దక్షిణ భారత రవాణా శాఖ మంత్రులతో త్వరలో ప్రత్యేక సమావేశం జరగనుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ఆక్వా ఫీడ్ ధరలు తగ్గించాలి


మొదటిపేజీ తరువాయి


దీంతో కేజీ ప్రస్తుతం రూ.112 నుంచి రూ.108కి ఫీడ్ ధరలు తగ్గనున్నాయి. ఆక్వా, టొబాకో, మామిడి రైతుల సమస్యలపై గురువారం అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆక్వా రైతులతోపాటు ఫీడ్ తయారీదారులతో ఆయన సమావేశమయ్యారు. ధరల స్థిరీకరణలో భాగంగా ఆక్వా రైతులు, తయారీదారులతో కమిటీ వేయాలని ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. 20 రోజుల్లో ఈ కమిటీ నివేదిక ఇవ్వాలని వారికి స్పష్టం చేశారు. అనంతరం ధరపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు, ఉన్నతాధికారులు, ఆక్వా రైతులతోపాటు ఫీడ్ తయారీదారులు పాల్గొన్నారు. ఆక్వా సాగుకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే ఇవ్వడంపై ముఖ్యమంత్రికి రైతులు ధన్యవాదాలు తెలిపారు. గోదావరి జిల్లాలకే పరిమితమైన ఆక్వా సాగును శ్రీకాకుళం జిల్లా నుంచి నెల్లూరు జిల్లా వరకు తీర ప్రాంతం పొడవునా విస్తరించేలా చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతోందని ఈ సందర్భంగా రైతులు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఫీడ్ ధరలు ఆరు సార్లు పెంచారని గుర్తు చేశారు. అయినా నాటి ప్రభుత్వం ధర తగ్గింపుపై చొరవ తీసుకోలేదని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు దృష్టికి ఆక్వా రైతులు తీసుకెళ్లారు. తాము ఎప్పుడూ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరించ లేదని.. ఇటీవల కొందరు రైతుల ముసుగులో రాజకీయం చేశారని సీఎంకు ఆక్వా రైతులు వివరించారు. 2019లో కేజీ ఫీడ్ ధర రూ.87.80 ఉంటే గత ప్రభుత్వం దిగిపోయే నాటికి అది రూ.107.80కి చేరిందని సీఎం చంద్రబాబుకు రైతులు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఫీడ్ ధర రూ.5.80 తగ్గించిందని రైతులు గుర్తు చేశారు. ఉత్పత్తి వ్యయం తగ్గించుకుని మరింత లాభాలు పొందేలా చర్యలు చేపట్టాలని రైతులకు సీఎం సూచించారు. లక్షలాది మంది ఆధారపడిన ఆక్వా రంగాన్ని పరిరక్షించే బాధ్యత కూటమి ప్రభుత్వానిదని ఈ సందర్భంగా రైతులకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టి సారించారు. గురువారం అమరావతిలోని సచివాలయంలో పొగాకు, మామిడి, ఆక్వా ధరలపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పొగాకు మార్కెట్ పరిస్థితులపై, సంబంధిత రైతుల సమస్యలు, ధరల స్థిరీకరణపై చర్చించారు సీఎం. పొగాకు బోర్డు ప్రతినిధులతో సీఎం చంద్రబాబు కీలక సమావేశం నిర్వహించారు. మామిడి రైతుల సమస్యలు, మార్కెటింగ్ అవకాశాలపై సమీక్షించారు. మామిడి దిగుబడులు, ధరల పరిస్థితులపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఉన్నతాధికారులు ఓ నివేదిక అందజేశారు. అదే విధంగా ఆక్వా రంగంలో ధరల హెచ్చుతగ్గులపైనా చర్చించారు సీఎం. రొయ్యలు, చేపల రైతుల సమస్యలపై ఈ సమీక్ష సమావేశంలో విస్తృతంగా చర్చించారు. రొయ్యల ఫీడ్ తయారీ సంస్థల ప్రతినిధులతోనూ ఆయన భేటీ అయ్యారు. ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, హ్యాచరీల ప్రతినిధులు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. వ్యవసాయం, ఉద్యానవన, మత్స్యశాఖల ఉన్నతాధికారులతో ఈ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు పాల్గొన్నారు.

# పార్టీ లైన్ దాటితే క్షమించేది లేదు


మొదటిపేజీ తరువాయి


వాటిని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ లేకుంటే రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్లాలని నేతలకు ఆయన సూచించారు. గురువారం గాంధీ భవన్‌లో మల్లు రవి విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ క్రమశిక్షణ కమిటీ ముందు హాజరవుతారన్నారు. కామారెడ్డిలో ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారని వివరించారు. షబ్బీర్ ఆలీకి నోటీసులు జారీ చేశామని చెప్పారు. ఆదివారం కమిటీ ముందు హాజరు కావాలని ఆయనకు సూచించామన్నారు. అందుకు షబ్బీర్ అలీ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ముందుగా షబ్బీర్ ఆలీ ఇచ్చిన ఫిర్యాదుపై క్రమశిక్షణ కమిటీ చర్చిందన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత తమ నిర్ణయం ప్రకటిస్తామని మల్లు రవి వెల్లడించారు. పార్టీ వ్యతిరేకంగా ఎవరు ప్రవర్తించిన క్రమశిక్షణ కమిటీ చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని నేతలకు ఎంపీ మల్లు రవి వార్నింగ్ ఇచ్చారు. పార్టీ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు.

# నేను జైల్లో ఉన్నప్పుడు.. బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేయాలనుకున్నారు: కవిత


మొదటిపేజీ తరువాయి


ఇటీవల బీఆర్ఎస్ తో తెగదెంపులు చేసుకుని, సొంతంగా తెలంగాణ రక్షణ సేన పేరుతో పార్టీని ఏర్పాటు చేసిన కల్వకుంట్ల కవిత.. గులాబీ బాస్‌లపై సంచలన ఆరోపణలు చేశారు. ఒక ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం బీఆర్ఎస్ అనే పార్టీ మనుగడలో ఉందంటే దానికి కారణం తానేనని స్పష్టం చేశారు.తాను ఢిల్లీ లిక్కర్ కేసులో జైల్లో ఉన్న సమయంలో.. బీఆర్ఎస్ పార్టీని తీసుకెళ్లి బీజేపీలో విలీనం చేయాలనే ప్రతిపాదనతో కొంతమంది నేతలు తన వద్దకు వచ్చారని కవిత వెల్లడించారు. ఆ ప్రతిపాదన వినగానే తాను తీవ్రంగా వ్యతిరేకించానని, విలీనానికి అస్సలు ఒప్పుకోకుండా స్ట్రాంగ్‌గా నిలబడ్డానని కవిత చెప్పారు. “నేనేం తప్పు చేయలేదు.. ఏదో ఒకరోజు బెయిల్‌పై కచ్చితంగా బయటకు వస్తాను, అంతవరకు పార్టీని వేరే పార్టీకి త్యాగం చేయవద్దని వారితో చెప్పాను. పార్టీ మనుగడ కోసం జైల్లో నా ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్ధపడ్డాను“ అని కవిత వివరించారు.ఇవాళ జైలు నుంచి బయటకు వచ్చాక కొందరు బీఆర్ఎస్ నేతలు టీవీల్లో కూర్చుని ఏది పడితే అది మాట్లాడుతున్నారని కవిత మండిపడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి తానే కారణమంటూ వస్తున్న ఆరోపణలను ఆమె పూర్తిగా ఖండించారు. ఎన్నికల సమయంలో చర్చ అంతా కేవలం ప్రభుత్వ వైఫల్యాల గురించే జరిగిందని, కానీ ఆ చేదు నిజాన్ని అంగీకరించడానికి బీఆర్ఎస్ నాయకత్వం ఇప్పటికీ సిద్ధంగా లేదని ఎద్దేవా చేశారు. పార్టీలో తాను తీవ్రమైన పక్షపాతాన్ని, అవమానాన్ని చవిచూశానని కవిత ఆవేదన వ్యక్తం చేశారు.

# పట్టిసీమ ఎత్తిపోతల పథకం ప్రారంభం

- రైతులకు సాగునీటి భరోసా కల్పించిన పోలవరం
- ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మరియు ట్రైకార్ చైర్మన్
- బొరగం శ్రీనివాసులు

**పోలవరం జూన్ 18(ప్రజా వీక్షణం)**

పోలవరం నియోజకవర్గ పరిధిలోని పట్టిసీమ ఎత్తిపోతల పథకం వద్ద ఈరోజు ఒక కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. పోలవరం శాసనసభ్యులు (ఎమ్మెల్యే) చిర్రి బాలరాజు ముఖ్య సమక్షంలో పట్టిసీమ ఎత్తిపోతల పథకం మోటర్లను స్విచ్ ఆన్ చేసి, కాలువల ద్వారా నీటిని విజయవంతంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ మరియు పోలవరం నియోజకవర్గ ఇంచార్జ్ బొరగం శ్రీనివాసులు అలాగే ఏపి స్పోర్ట్స్ ఆథారిటి డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరీ పాల్గొని ఈ మోటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు స్వయంగా పాల్గొని, రైతులతో మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రతి ఎకరాకూ సాగునీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేస్తూ, రైతులకు నీటి లభ్యతపై ఆయన పూర్తి భరోసా కల్పించారు. పట్టిసీమ ద్వారా సాగునీరు విడుదల కావడం పట్ల హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే రాబోయే రోజుల్లో రైతు సంక్షేమమే ధ్యేయంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని, ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందుబాటులోకి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.





# నేడు బాపట్లలో ప్రభుత్వ రెండేళ్ల విజయోత్సవ సభ

- ఏర్పాట్లను పరిశీలించిన బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు





**బాపట్ల : జూన్ 18 (ప్రజా వీక్షణం)**

కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా " రెండేళ్ల పాలన – రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి – సంక్షేమం " పేరిట శుక్రవారం ఉదయం 10 గంటలకు బాపట్ల పట్టణంలోని తూర్పు సత్రం వద్ద భారీ విజయోత్సవ సభను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను గురువారం బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం సభా ప్రాంగణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ.....ఈ ప్రతిష్ఠాత్మక విజయోత్సవ సభకు జిల్లా ఇంచార్జ్ మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులు మరియు ముఖ్య నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. గడిచిన రెండేళ్లలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, సాధించిన అభివృద్ధి ఫలితాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం ఒక గొప్ప వేదిక అని అన్నారు. ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న నమ్మకాన్ని, విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా ఈ సభ నిర్వహణ ఉండాలి అని ఆయన పేర్కొన్నారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వేదిక నిర్మాణం, బారికేడింగ్, సీటింగ్, తాగునీరు మరియు విద్యుత్ సరఫరా వంటి ముందస్తు ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని అన్నారు. సభా ప్రాంగణంలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మునిసిపల్ అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, కార్యక్రమానికి ముందు, తర్వాత కూడా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ నియంత్రణకు, వాహనాల పార్కింగ్ కు పోలీస్ శాఖ ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, భద్రతను పటిష్టం చేయాలని అన్నారు. సభా ప్రాంగణంలో అత్యవసర వైద్య సేవల కోసం ప్రత్యేక మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయాలని అన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు ఒకరితో ఒకరు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ప్రభుత్వ సేవలపై మరింత నమ్మకం కలిగేలా ఈ విజయోత్సవ సభను ఆదర్శవంతంగా నిర్వహిద్దామని శాసన సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు సలగల రాజ శేఖర్ బాబు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు అల్లం గోపికృష్ణ, జనసేన పార్టీ బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, టీడీపీ బాపట్ల పట్టణ అధ్యక్షులు, రాష్ట్ర నాటక పరిషత్ డైరెక్టర్ మందపాటీ ఆంద్రేయ, బాపట్ల ఆర్డీఓ హరికుమార్, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మూలపాలెంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం

**బాపట్ల : జూన్ 18 (ప్రజా వీక్షణం)**

బాపట్ల మండలం మూలపాలెం గ్రామంలో గురువారం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( సర్ )కార్యక్రమంలో భాగంగా 14 వ నంబర్ బూత్ నందు ఇంటింటికి తిరిగి ఓటరు వెరిఫికేషన్ చేయడం జరిగింది. ప్రతి ఇంటికి వెళ్లి వారికి కావలసిన పత్రములు ఇచ్చి పూర్తి చేయించి తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బడుగు యోహాను, బీఎల్ఓ పాల్గొన్నారు.



# పరిశుభ్రమైన పట్టణ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి

- మునిసిపల్ కమీషనర్ ఎం.హాసిని

**బాపట్ల : జూన్ 18 (ప్రజా వీక్షణం)**

పరిశుభ్రమైన పట్టణ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని బాపట్ల మునిసిపల్ కమీషనర్ మామిళ్లపల్లి హాసిని పిలుపునిచ్చారు. గురువారం ఉదయం ఆమె పట్టణంలోని శ్రీనివాస నగర్ మరియు పటేల్ నగర్ ప్రాంతాలను సందర్శించి, ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందిస్తున్నారా లేదా అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తడి, పొడి చెత్తను తప్పనిసరిగా వేర్వేరుగా అందించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య సిబ్బందికి ఇంటింటికి చెత్త సేకరణను ప్రతిరోజూ సమయానికి నిర్వహించాలని, చెత్తను కలపకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని ఆదేశించారు. ప్రజలకు చెత్త వర్గీకరణపై నిరంతరం అవగాహన కల్పిస్తూ, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పట్టణానికి పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి కుటుంబం పురపాలక సంఘానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వారి వెంటc శానిటరీ ఇన్స్పెక్టర్ చేవూరి కరుణ ఉన్నారు.



# స్వచ్ఛమైన పట్టణం.... ఆరోగ్యకరమైన భవిష్యత్తు మన లక్ష్యం

- పురపాలక సంఘ కమిషనర్ ఏసుబాబు

**తాడేపల్లిగూడెం ప్రతినిధి జూన్18 (ప్రజా వీక్షణం)**

స్వచ్ఛమైన పట్టణం ఆరోగ్యకరమైన భవిష్యత్తు మన లక్ష్యమని పురపాలక సంఘ కమిషనర్ ఎం.ఏసుబాబు సూచించారు. తాడేపల్లిగూడెం పురపాలక సంఘ కమిషనర్ ఏసుబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా స్థానిక 6వ వార్డులోని వాసవి పార్క్ ప్రాంతంలో విస్తృత శుభ్రత కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రస్తుతం వినియోగంలో లేని వాసవి పార్క్‌లోని చెత్తాచెదారాన్ని, పొదలు, పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను, పార్కు చుట్టూ ఉన్న ముళ్ల కంపలను తొలగించి, నడక మార్గాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ దోమలు, ఇతర క్రిమికీటకాలకు నిలయంగా మారిన ఈ పార్కును భవిష్యత్తులో పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో ముందస్తుగా ప్రక్షాళన చర్యలు తీసుకున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డ్ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.





# ఎస్ఐఆర్-2026పై అవగాహనకు 2కె రన్

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 18 (ప్రజా వీక్షణం న్యూస్)**

ఖచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని జిల్లా కలెక్టర్ అండ్ జిల్లా ఎన్నికల అధికారి చాహాత్ బాజ్ పాయ్ పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్–2026 ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు గురువారం నిర్వహించిన 2కె రన్‌ను ప్రారంభించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తారని, జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా, అక్టోబర్ 1న తుది జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవడంతో పాటు అవసరమైన సవరణలు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల సహాయార్థం ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు, 1950 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందు బాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీపీ ధార కవిత, అదనపు కలెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.





# సుందరయ్య నగర్‌లో ముమ్మరంగా ఓటర్ల సర్వే వెరిఫికేషన్

**కొయ్యలగూడెం:జూన్ 18(ప్రజా వీక్షణం)**

ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం స్థానిక బస్ స్టాండ్ పక్కన ఉన్న సుందరయ్య నగర్‌లో ఓటర్ల సర్వే వెరిఫికేషన్ ప్రక్రియ గురువారం అత్యంత వేగంగా సాగింది. ఎన్నికల నిబంధనల ప్రకారం ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 218వ బూత్ కన్వీనర్ జినిగి కిషోర్ బాబు ఆధ్వర్యంలో ఓటర్ల వివరాల నమోదు, సరిచూసే ప్రక్రియను చేపట్టారు. ఈ సర్వే వెరిఫికేషన్‌లో కొయ్యలగూడెం మండల ప్రచార కమిటీ అధ్యక్షులు డాక్టర్ వాసు స్వయంగా పాల్గొన్నారు. ఆయన తన గణన పత్రాన్ని, ఓటర్ల జాబితాలోని తన వివరాలను బూత్ స్థాయి అధికారి అలీకి అందజేశారు. ఈ సందర్భంగా తన ఓటర్ గుర్తింపు కార్డును చూపిస్తూ, ప్రస్తుత పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోను అధికారికంగా సమర్పించారు. ఓటర్ల జాబితా పారదర్శకత కోసం, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా జరుగుతున్న ఈ ప్రక్రియలో స్థానిక ప్రజలందరూ చురుగ్గా పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ వెరిఫికేషన్ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు ప్రసాద్, రాజు తదితరులు పాల్గొని సర్వే సజావుగా సాగేలా తమ వంతు సహకారాన్ని అందించారు.



ప్రజావీక్షణం
దినపత్రిక

# గరికపాడు కేవీకేలో ప్రకృతి వ్యవసాయంపై ప్రాంతీయ కార్యశాల

## భూసార రక్షణకు ప్రకృతి సాగే శరణ్యం

## కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎమ్. రవి కిషోర్

### - హాజరైన ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య, బీజేపీ నేత వల్లూరి జయప్రకాష్ నారాయణ

**గరికపాడు, జూన్ 18 (ప్రజావీక్షణం):**

జగ్గయ్యపేట నియోజకవర్గం గరికపాడు గ్రామంలోని ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలో గల డాక్టర్ కె.ఎల్.రావు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) లో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన ఒక రోజు ప్రాంతీయ కార్యశాల, శిక్షణా కార్యక్రమం ఘనంగా ముగిసింది. ఎన్టీఆర్ జిల్లా కిసాన్ మోర్చా సహకారంతో నిర్వహించిన ఈ సదస్సుకు నేల సంరక్షణను పెంపొందించడం, సుస్థిర సాగు పద్ధతులు మరియు పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించడమే ప్రధాన ధ్యేయంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య, బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ నారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎన్టీఆర్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యశాలలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మరియు అధిపతి డాక్టర్ ఎమ్. రవి కిషోర్ పరిచయ ప్రసంగం చేశారు. ప్రస్తుత కాలంలో భూసార రక్షణకు ప్రకృతి వ్యవసాయం యొక్క ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు, ప్రగతిశీల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతులకు క్షేత్రస్థాయి సాగు విధానాలపై కేవీకే శాస్త్రవేత్తలు నాలుగు ప్రత్యేక సాంకేతిక విభాగాలుగా శిక్షణ ఇచ్చారు:

**మొదటి విభాగం:**

డాక్టర్ ఎమ్. రవి కిషోర్ ప్రకృతి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. రెండవ విభాగం: పంటల ఉత్పత్తి విషయ నిపుణులు డాక్టర్ పి.ఎన్. శివ ప్రసాద్ ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులను



క్షుణ్ణంగా వివరించారు.
మూడవ విభాగం: సస్యరక్షణ విషయ నిపుణులు డాక్టర్ ఎన్. రాజశేఖర్ పంటలకు ఆశించే తెగుళ్లు, కీటకాల నివారణోపాయాలపై శిక్షణ ఇచ్చారు.
నాల్గవ విభాగం: గంచిప్రోలు ప్రాంతీయ ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి జి. వనరప్ప క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయ సాధనాల ప్రాముఖ్యతను వివరించారు.
శిక్షణ అనంతరం నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో రైతులు అడిగిన పలు సాంకేతిక సందేహాలను శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన రైతులకు ముఖ్య అతిథులు ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య, వల్లూరి జయప్రకాష్ నారాయణ చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అదేవిధంగా, బిజెపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ చేతులమీదుగా రైతులకు ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు. చివరగా జి. వనరప్ప కృతజ్ఞత వందనం సమర్పించగా, జాతీయ గీతాలాపనతో ఈ ప్రాంతీయ కార్యశాల విజయవంతంగా ముగిసింది.

# సఖి - వన్ స్టాప్ సెంటర్ ను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

**బాపట్ల : జూన్ 18 (ప్రజా వీక్షణం)**

బాపట్ల పట్టణంలోని అక్బర్ పేట లో ఉన్న సఖి - వన్ స్టాప్ సెంటర్ ను గురువారం బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్.వి.వినోద్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....సఖి కేంద్రంలో సేవలు పకడ్బందీగా ఉండాలన్నారు. బాధితులకు మెరుగైన వైద్యం,ఆశ్రయం,న్యాయ సలహాలు సకాలంలో అందాలని తెలిపారు. బాధిత మహిళల పట్ల సిబ్బంది సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. మౌలిక వసతులు,రికార్డుల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారిణి రాధా మాధవి,బాపట్ల మునిసిపల్ కమీషనర్ మామిళ్లపల్లి హాసిని,మునిసిపల్ డీఈ కృష్ణా రెడ్డి ఉన్నారు.



# ఇటికలకోట ఆశ్రమ పాఠశాలకు గ్రామస్తుల తాళాలు!

### - 8, 9, 10 తరగతుల తొలగింపుపై వెల్లువెత్తిన నిరసన
### - గిరిజన విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడొద్దు: ప్రభుత్వానికి హెచ్చరిక
### - గేటు బయటే భోజనశాలలో విద్యార్థులకు పాఠాలు

**పోలవరం, జూన్ 18 (ప్రజా వీక్షణం):**

ఏలూరు జిల్లా పోలవరం మండలంలోని ఇటికలకోట గ్రామంలో ఉన్నా గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలలో 8, 9, 10 తరగతులను కుదించాలనే ప్రభుత్వ నిర్ణయంపై స్థానిక గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ గురువారం ఉదయం గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు భారీ సంఖ్యలో తరలివచ్చి పాఠశాల ప్రధాన గేట్లకు తాళాలు వేసి ధర్నాకు దిగారు. గిరిజన విద్యార్థుల విద్యా భవిష్యత్తుతో చెలగాటమాడొద్దంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. గ్రామస్తుల కథనం ప్రకారం... గత రెండు రోజుల క్రితం ఉన్నతాధికారులు పాఠశాల ప్రధానోపాధ్యాయునికి ఫోన్ చేసి, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు టీసీలు (బదిలీ ధృవీకరణ పత్రాలు) ఇచ్చి పంపించేయాలని సూచించారు. ఈ విషయం కాస్తా బయటకు పొక్కడంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. 2026-27 విద్యా సంవత్సరం నుంచి రేషనలైజేషన్ పేరుతో ఈ పాఠశాల స్థాయిని తగ్గించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని గ్రామస్తులు ఆరోపించారు. పాఠశాలను కేవలం 3 నుంచి 7వ తరగతి వరకే పరిమితం చేసి, హైస్కూల్ సెక్షన్‌ను (8, 9, 10 తరగతులు) ఇక్కడికి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న చేగుండపల్లి ఆశ్రమ పాఠశాలకు తరలించాలని నిర్ణయించడంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ... తమ పిల్లలు చిన్నప్పటి నుంచి ఇదే పాఠశాలలో చదువుకుంటున్నారని, అకస్మాత్తుగా కొత్త వాతావరణానికి పంపితే వారు త్వరగా అలవాటు పడలేరని ఆవేదన వ్యక్తం చేశారు. తామంతా రోజువారీ కూలీ పనులు చేసుకుని బతికే వాళ్లమని,



అంత దూరం పిల్లలను పంపించి చదివించే ఆర్థిక స్తోమత తమకు లేదని స్పష్టం చేశారు. పాఠశాలలో బోధన, వసతులు, భోజన నాణ్యత బాగున్నప్పుడు, తరగతులను ఎందుకు తొలగిస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. 1 నుంచి 10వ తరగతి వరకు పాఠశాలను యథావిధిగా కొనసాగించాల్సిందేనని వారు డిమాండ్ చేశారు. గ్రామస్తుల ఆందోళన నేపథ్యంలో పాఠశాల భవనానికి తాళాలు పడటంతో, ఉపాధ్యాయులు విద్యార్థులను ఎదురుగా ఉన్న భోజనశాలలో కూర్చోబెట్టి పాఠాలు బోధించారు. తరగతుల తొలగింపు నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోకపోతే, తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు సున్నం గంగాజలం, తామా బాలరాజు, దర్మల లక్ష్మి, పోసి రత్నం, ఇందిరావతి, సుధారాణి, వెంకటలక్ష్మి, రామకృష్ణ తదితర గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల నియంత్రణలో డ్రగ్స్ కంట్రోల్ టీం పని తీరు ప్రశంసనీయం

### - సీపీ సన్ ప్రీత్ సింగ్

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 18 (ప్రజా వీక్షణం న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనరే ట్ పరిధిలో మత్తు పదార్థాల నియంత్రణలో డ్రగ్స్ కంట్రోల్ టీం విశేష ఫలితాలు సాధిం చిందని పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. 2024 జూలై 15 నుంచి 2026 జూన్ 16 వరకు 192 కేసులు నమోదు చేసి 403 మందిపై చర్యలు తీసుకున్న ట్లు తెలిపారు. ఈ కాలంలో 1,241 కిలోల గంజాయి, 1.53 కిలోల ఓపియం, 22.4 లీటర్ల హషీష్ ఆయిల్‌తో పాటు మొత్తం రూ.8.57 కోట్ల విలువైన మాదకద్రవ్యా లను స్వాధీనం చేసుకున్న ట్లు వెల్లడించారు. అలాగే 601 మొబైల్ ఫోన్లు, 77 వాహనాలు, నగదు స్వాధీనం చేసుకున్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన తో పాటు 435 మందికి కౌన్సెలింగ్ నిర్వహించామని, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. గంజాయి రవాణా, విక్రయాలపై సమాచారం ఉన్నవారు 8712685299, 8712584473 నంబర్లకు తెలియజేయాలని, సమాచారదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.



# ప్లాస్టిక్ రహిత మార్కెట్లే లక్ష్యంగా ముందుకు సాగాలి

### - ప్రత్యామ్నాయ బ్యాగుల ప్రత్యేక స్టాల్‌ను ప్రారంభించి న జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూ ఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్





**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 18 (ప్రజా వీక్షణం న్యూస్)**

పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్య రక్షణ కు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, మార్కెట్ల ను ప్లాస్టిక్ రహితంగా తీర్చి దిద్దేందుకు సమష్టి కృషి అవసరమని జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్ పాయ్ అన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహ న కల్పించేందుకు జీడబ్ల్యూ ఎంసీ ఆధ్వర్యంలో హన్మకొండ ఎక్సయిజ్ కాలనీ రైతు బజార్ లో ఏర్పాటు చేసిన జూట్, క్లాత్ బయో డిగ్రేడబుల్ బ్యాగుల ప్రత్యేక స్టాల్‌ను గురువారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ, ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు ప్రజల ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. అందువల్ల ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్ బ్యాగులు, క్లాత్ బ్యాగులు, బయోడిగ్రేడబుల్ బ్యాగుల వినియోగాన్ని ప్రతి ఒక్కరూ అలవాటు చేసు కోవాలని సూచించారు. మార్కెట్ ప్రాంతాల్లో వ్యాపారులు, వినియోగ దారులు ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని పూర్తిగా మానుకుని పర్యావరణ హిత ఉత్పత్తులను వినియోగించాలని కోరారు. ఇకపై మార్కెట్లను దశల వారీగా ప్లాస్టిక్ రహిత మార్కెట్లుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక స్టాల్ ద్వారా ప్రజలకు అందుబాటు ధరల్లో ప్రత్యా మ్నాయ బ్యాగులు లభిస్తా యని, వాటిని వినియోగించడంతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు, పొరుగువారిలో కూడా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. పర్యా వరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. ఈ కార్య క్రమంలో సీఎం హెచ్ ఓ రాజారెడ్డి, ఆర్డీఓ వెంకటేష్, బల్దియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నీట్2026 నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 18 (ప్రజా వీక్షణం న్యూస్)**

ఈ నెల 21న నిర్వహించను న్న నీట్2026 పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని హన్మకొండ అదనపు కలెక్టర్ రవి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 12 పరీక్షాకేంద్రాల్లో 4,196 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. మధ్యాహ్నం 2 గంటలనుంచి 5.15 గంటల వరకు పరీక్ష జరగనుండగా, దివ్యాంగుల కు అదనపు సమయం కల్పించనున్నారు. అభ్యర్థు లు మధ్యాహ్నం 1.30 గంటలలోపు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, వైద్య సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారుల కు ఆదేశించారు. అభ్యర్థుల సౌకర్యార్థం అన్ని కేంద్రాలకు ప్రత్యేక ఆర్టీసీ బస్సుసౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపా రు. పరీక్షలను విజయవం తంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయం తో పనిచేయాలని సూచించారు.



# మొహర్రం ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

## - అదనపు కలెక్టర్ రవి

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 18 (ప్రజా వీక్షణం న్యూస్)**

మొహర్రం పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని హన్మకొండ అదనపు కలెక్టర్ ఎన్. రవి అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమన్వయ సమావేశం లో ఆయన మాట్లాడుతూ, ఊరేగింపు మార్గాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు,విద్యుత్, వైద్య శిబిరాలు, అగ్నిమాపక భద్రత, ట్రాఫిక్ నియంత్రణ వంటి ఏర్పాట్లు చేయాలని సూచించారు. హనుమకొండ బ్రాహ్మణవాడ నుంచి మచిలీ బజార్ వరకు జరిగేమొహర్రం ఊరేగింపుకు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు.జిల్లాలో 170 అషుర్‌ఖానా లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



# ప్రధాన మంత్రి యోజన పేరుతో రూ.84 వేల మోసం

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 18 (ప్రజా వీక్షణం న్యూస్)**

ప్రధాన మంత్రి యోజన పథకం కింద రూ.4 లక్షల రుణం ఇప్పిస్తామని నమ్మ బలికి ఓ వ్యక్తి నుంచి రూ.84,870 వసూలు చేసి మోసగించిన ఘటన హసన్ పర్తిలో వెలుగుచూసింది.పోలీసుల వివరాల ప్రకారం, హసన్‌పర్తి గ్రామానికి చెందిన గుడికందుల రాజు (45) యూట్యూబ్‌లో ప్రధాన మంత్రి యోజనకు సంబం ధించిన వీడియో చూసి అందులో పేర్కొన్న ఫోన్ నంబర్లను సంప్రదించాడు. రుణం మంజూరు చేస్తామని చెప్పిన మోసగాళ్లు బీమా, పన్నులు, ఎన్‌ఓసీ, ఈఎంఐ, రిజిస్ట్రేషన్ ఫీజుల పేరుతో విడతల వారీగా వివిధ బ్యాంకు ఖాతాలకు డబ్బులు జమ చేయించారు.ఫిర్యాదుదారు తన ఖాతా నుంచి, అలాగే తన స్నేహితు డి ఖాతా ద్వారా కలిపి మొత్తం రూ.84,870 బదిలీ చేశాడు. అనంతరం రుణం మంజూరు కాకపోవడంతో సంబంధిత నంబర్లకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్‌లో ఉన్నట్లు గుర్తించాడు. తాను మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేయగా, అనంతరం హసన్ పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# డిజిటల్ షాప్ ప్రారంభం,.

**దేవరకద్ర,జూన్ 18 ప్రజా వి క్షణం**

మండల పరిధిలోని పేరూరు కు చెందిన నాగశాకేత్ డిజిటల్స్ దేవరకద్ర లో గురువారంవీడియో మిక్సింగ్ షాప్ ఓపెన్ చేయడం జరిగింది. షాప్ ఒపనింగ్ వచ్చిన ముఖ్య అతిధులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోవర్ధన్ రెడ్డి, దేవరకద్ర కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు యం.డీ.ఫరూక్ అన్న, రిబన్ కట్ చేయడం జరిగింది. దేవరకద్ర మండల్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ అధ్యక్షులు యం. డీ. ఖుదు బుద్దీన్ ద్దీన్, ప్రధాన కార్యదర్శి యం. డి. ఫయాజ్ ద్దీన్,కుటుంబ భరోసా ఇంచార్జ్ నారాయణ,సీనియర్ ఫోటో గ్రాఫర్ వీరన్న,ఫోటో గ్రాఫర్ ప్రేమ్ వీడియో గ్రాఫర్ నవాజ్ ఆల్బమ్ క్రియేషన్ శివ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





# రైతు భీమా పథకానికి పెండింగ్ నిధులను చెల్లించాలి

## - ఎల్ఐసికి చెల్లించాల్సిన ప్రీమియం బకాయిలను వేంటనే విడుదల చేయాలి

## - చుంచు రాజేందర్ డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 18 (ప్రజా వీక్షణం న్యూస్)**

రాష్ట్ర వ్యాప్తంగా రైతు భీమా పథకానికి పెండింగ్‌లో ఉన్న 7,606 రైతు భీమా క్లైయిమ్ లు, 436 కొట్ల బకాయి నిధులను చెల్లించాలని,ఎల్ఐసి కి చెల్లించాల్సిన ప్రీమియం బకాయిలను వెంటనే విడుదల చేసి రైతాంగానికి భరోసా కల్పిం చాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆత్మ కూరు మండలం నాగయ్య పల్లి గ్రామంలో డిబిఎఫ్ కమ్యూనిటీ నాయకులు, రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్య క్షులు చుంచు రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రైతు భీమా ప్రీమియం బకాయిలు పేరుకుపోవడం తో వేలాది మంది రైతు కుటుంబాల పాలిట శాపంగా మారిందని, రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా 7,606 క్లైయిమ్ లు పెండింగ్‌లో పడ్డాయన్నారు.దీనివల్ల వివిధ కారణాల తో చనిపోయిన రైతులకు భీమా పథకం వర్తించక పోవడంతో కార్యాలయాల చుట్టూ తిరుగుతూ మనో వేధనకు గురౌతున్నారని 2018 లో తెచ్చిన ఈ రైతు భీమా పథకం ప్రమాద వశాత్తు, సహజ మరణం చెందితే 5లక్షల సహాయం పొందే పథకమన్నారు. 2025-26 ఆర్థిక సంవత్స రానికి సంబంధించి ఎల్ఐసికి ప్రీమియం కింద రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి న మొత్తం రూపాయలు 1,359.56 కొట్లు బకాయిలు ఉండటంతో కేవలం 923.11 కొట్లు మాత్రమే చెల్లించి చేతులు దులుపుకుందన్నా రు.436 కొట్ల బకాయిలు ఉండటంతో ఎల్ఐసి తదు పరి క్లైయిమ్ లను ప్రాసెస్ చేయకుండా నిర్దాక్షిణ్యంగా అపివేసిం దన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి వెంటనే స్పందించి రైతు భీమా పథకానికి ఉన్న పెండింగ్ నిధులను విడుదల చేసి రైతులను ఆదుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల జెఎసి జిల్లా చైర్మన్ మాదాసి సురేష్, డిహెచ్ పియస్ రాష్ట్ర నాయ కులు సంఘి ఎలెందర్, డిబిఎఫ్ నాయకులు మాదాసి పెద్ద రాజు,అప్పని శ్రీను, గిన్నారపు బాస్కర్,మాదాసి జగన్, రాజేష్, బస్వారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అద్వితీయ పాలన అందిస్తోంది

## తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల మల్లికార్జునరావు



**తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 18 (ప్రజా వీక్షణం)**

ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్దే ధ్యేయంగా అద్వితీయ పాలన అందిస్తుందని తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్, భవన, ఇతర నిర్మాణ కార్మి కుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లిఖార్జునరావు (బాబ్జి) తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు స్థానిక తెదేపా కార్యాలయంలో ఆయన అధ్యక్షతన గురువారం గ్రీవెన్స్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమానికి తెదేపా నియోజకవర్గ పరి శీలకులుగా ఇటీవల నియ మితులైన గోపాలపురం ఏఎంసి చైర్మన్ యద్దన పూడి బ్రహ్మరాజు హాజ రయ్యారు. నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు, ఫిర్యాదులు, అభ్యర్థ నలను స్వీకరించారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 35 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ 15,09,933 రూపాయలు విలువైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వలవల మల్లఖార్జునరావు (బాబ్జి) మాట్లాడుతూ నియోజకవర్గ పరిశీలకులుగా నియ మితులైన యద్దనపూడి బ్రహ్మరాజు పార్టీ కోసం ఎన్నో సేవాలందించారని కొనియాడారు. కార్యకర్తల కష్ట సుఖాలు తెలిసిన వ్యక్తిని పరిశీల కులుగా నియమించటం ఎంతో ఆనందాయికమని చెప్పారు. ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా ఎంతోమంది పేదలకు లబ్ధి చేకూ రుతుందని తెలిపారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి సంబంధించి ఎన్ని చెక్కులు అడిగినా వాటిని మంజూరుచేస్తూ పూర్తి సహకారం అందిస్తున్నారని చెప్పారు. తాను సెక్ర టేరియట్ కు వెళ్లినప్పుడల్లా అధికా రులను కలిసి చెక్కులు త్వరితగతిన మంజూరయ్యే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటున్నానని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండేళ్ళు పూర్తయిన సందర్భంగా ఈ నెల 19న భీమవరంలో విజయోత్సవ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేపడు తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్రాన్ని పురోగతి పథంలో నడిపి స్తున్నాయని చెప్పారు. ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పెట్టుబడి ఆకర్షణ, ఉపాధి కల్పన వంటి రంగాల్లో కూటమి ప్రభుత్వం విశేష ఫలితాలు సాధించిందన్నారు. విజయోత్సవ సభకు నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని వివరించారు. తెదేపా నియోజకవర్గ పరిశీలకులు యద్దన పూడి బ్రహ్మరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలతో రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తుందని చెప్పారు. ఏమైనా చిన్న చిన్న సమస్య లుంటే నాయకులు, కార్యకర్తలు వాటిని సర్దుబాటు చేసుకుంటూ ముందుకెళ్లాలని, పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్య లను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని వివరించారు. ముందుగా బాబ్జి పరిశీలకులు బ్రహ్మరాజును పుష్పగుచ్చం, సాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముత్యాల వీర వెంకట సత్యనారాయణ, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, ముప్పిడి రమేష్, శ్రీరాముల విజయలక్ష్మి, కాకర్ల సుభద్ర, అబ్బిన వీర వెంకట్రావు, ఎరుబండి సతీష్, రాంబాబు, మాదాసు సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# రైతు మరణ ఘటనపై రాజకీయాలు చేయొద్దు: కాంగ్రెస్ నాయకులు

**ఆదిలాబాద్ జిల్లా, జూన్ 18: (ప్రజా వీక్షణం)**

రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మ హత్యలకు పాల్పడవద్దని, ఇటీవల జరిగిన రైతు మరణ ఘటనను రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించు కోవడం సరికాదని కాంగ్రెస్ నాయ కులు పేర్కొన్నారు. వారు మాట్లా డుతూ, జొన్న కొనుగోలు కేంద్రంలో సంబంధిత రైతు పంటకు కాటా, లాట్ నంబర్ రసీదులు ఇప్పటికే జారీ చేసినట్లు తెలిపారు. రైతు జొన్నలను గోదాములకు తరలించేందుకు అధి కారులు సిద్ధంగా ఉన్నప్పటికీ, పలుమార్లు సమాచారం అందించినా రైతు కొనుగోలు కేంద్రానికి రాలేదని చెప్పారు. మార్కెట్‌కు వచ్చిన జొన్నలను వర్షానికి నానిపోకుండా కొనుగోలు చేసి గోదాములకు తరలించే చర్యలు చేపట్టినట్లు వివరించారు.అయితే రైతు మరణానికి గల అసలు కారణాలపై అధికారులు విచారణ కొనసాగిస్తున్నారని తెలిపారు. రైతు మరణం బాధాకరమని, ఈ ఘటనపై అందరూ విచారం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. రైతులు ఇలాంటి ఆత్మ హత్యలకు పాల్పడ కుండా ధైర్యంగా సమస్యలను ఎదుర్కో వాలని సూచించారు.ఈ ఘటనను కొందరు రాజకీయ కోణంలో చూస్తూ ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. వాస్తవాలు తెలుసుకోకుండా రాజకీయాలు చేయడం తగదని, రైతుల సమస్యలపై నీతిమాలిన రాజకీయాలకు దూరంగా ఉండాలని సూచించారు.మృత రైతు కుటుంబానికి ప్రభుత్వం తరఫున, పార్టీ పరంగా అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రైతులు, పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తుందని నాయ కులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిరికొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కంచం లక్ష్మన్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి షేక్ ఇమామ్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బొడ్డు దత్తాత్రి, మాజీ జడ్పీటీసీ చంద్రకళ రఘురాం, కన్నాపూర్ సర్పంచ్ బాలాదేవి చంద్రకాంత్, ఉప సర్పంచ్ తోకల రాజు, రాయిసీడం భీమ్రావు, చిక్రం పరమేశ్వర్, మైనారిటీ చైర్మన్ ఎండీ రంజాన్, కాంగ్రెస్ నాయకులు జల భూమన్న, ఎల్లయ్య, రషీద్, తిరుపతి, చిన్న లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.



# తమిళనాట అనూహ్య రాజకీయ పరిణామాలు

## - సిఎం విజయ్‌తో వైకో భేటీతో ఊహాగానాలు

## - డిఎంకెను వీడుతారన్న ప్రచారం

చెన్నై,జూన్18 (ప్రజా వీక్షణం)

తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.తన స్థానాన్ని పదిలం చేసుకునే దిశగా సిఎం విజయ్ అడుగులు వేస్తున్నారు. ద్రవిడ పార్టీలు కలిసినా తన మనుగడకు ఢోకా లేకుండా చేసుకుంటున్నారు. అందుకే అన్నా డిఎంకె ఎమ్మెల్యేలు ఒక్కరొక్కరుగా రాజీనామా చేసి, టివికెలో చేరుతున్నారు. వీరంతా మళ్లీ ఉప ఎన్నికల్లో అధికార పార్టీ నుంచి పోటీచేసే అవకాశం ఉంది. దీంతో అన్నా డిఎంకె కూడా పూర్తిగా బలహీనపడే పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు వైకో సిఎంతో భేటీ కావడం మరో కొత్త అంశం తెరపైకి వచ్చింది. డీఎంకేకు చిరకాల మిత్రపక్షమైన మరుమలార్చి ద్రవిడ మున్నేట్ర కళగం(ఎండీఎంకే) అధికార తమిళగ వెట్రి కళగం(టీవీకే)తో జట్టుకట్టనుందా? అనే చర్చ ఆ రాష్ట్ర రాజకీయాల్లో జోరందుకుంది. ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైకో.. సీఎం జోసెఫ్ విజయ్‌తో భేటీ కావడం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది. కాగా.. ఇటీవలే వైకో కుమారుడు, ఎండీఎంకే ఎంపీ దురై వైకో కూడా విజయ్‌తో సమావేశమైన సంగతి తెలిసిందే. కాగా.. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని కూటమిలో ఎండీఎంకే పోటీచేసి రెండు స్థానాలను కైవసం చేసుకుంది. ఆ పార్టీ సాధారణ మండలి సమావేశం ఈ నెలాఖరులో జరగనుంది. పార్టీ భవిష్యత్తు రాజకీయ దిశగా ఆ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్టు తెలుస్తోంది. అయితే.. టీవీకే నేతృత్వంలోని మైనారిటీ ప్రభుత్వంపై జరిగిన విశ్వాస పరీక్షలో ఎండీఎంకే తటస్థంగా వ్యవహరించింది. డీఎంకేతో కలిసి పనిచేసిన పలువురు మాజీ మిత్రపక్షాలు ఇప్పటికే టీవీకే ప్రభుత్వానికి మద్దతిస్తున్నాయి. కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీలు అధికార వ్యవస్థలో భాగస్వాములయ్యాయి. మరోవైపు సీపీఐ, సీపీఎం పార్టీలు విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి బయట నుంచే మద్దతు తెలుపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎండీఎంకే వైఖరి మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. యితే.. ఈ ఊహాగానాలపై వైకో అప్రమత్తంగా వ్యవహస్తున్నట్టు తెలుస్తోంది. పార్టీ భవిష్యత్తు రాజకీయ నిర్ణయాలను సాధారణ మండలి ఆధ్వర్యంలోనే తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. సీఎం విజయ్‌తో సమావేశం పూర్తిగా ప్రజా సమస్యలపైనే జరిగిందని పేర్కొన్నారు. తూత్తుకుడిలో వేదాంత గ్రూప్‌నకు అనుబంధంగా మరో రాగి పరిశ్రమ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అలాంటి ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వొద్దని కోరానని వెల్లడించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి

## - మండల విద్యాధికారి పి . బలరాం.

దేవరకద్ర జూన్ 18 ప్రజా విక్షణం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని దేవరకద్ర మండల విద్యాధికారి పి బలరాం తెలిపారు. గురువారం. మండలంలోని ప్రాథమిక పాఠశాల దాడి తాండ మరియు ప్రాథమిక పాఠశాల శివారు తాండ పాఠశాలలను సందర్శించారు ఆయా గ్రామాలలో బడిబాట కార్యక్రమంలో నిర్వహించారు విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు మరియు ప్రభుత్వ పాఠశాలల్లోనే బోధన ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్య లభిస్తుందని తెలిపారు. మరియు విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు విద్యార్థులను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు మరియు పాఠశాలల్లో విద్యార్థులచే పాఠాలను చదివించి రాయించి విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. మరియు పాఠశాల రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిత్యానంద స్వామి జగనాథ్ ఉపాధ్యాయులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

# అవినీతిపై ప్రశ్నిస్తే ఎదురుదాడులా?

## సమాధానం చెప్పకుండా తప్పించుకోలేరు

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై కొప్పుల ఫైర్

కరీంనగర్,జూన్18 (ప్రజా వీక్షణం)



ధాన్యం కొనుగోళ్లు, సంక్షేమ హాస్టళ్ల టెండర్లలో భారీ అవినీతి జరిగిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. ఈ విషయాలపై సమాధానం చెప్పకుండా వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. ధర్మపురి నియోజకవర్గంలోని ఇసుక రీచ్‌లు మాయమయ్యాయన్న అంశం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఈ మేరకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు నిజంగా ధైర్యం ఉంటే మంత్రి పదవికి రాజీనామా చేసి ప్రజల ముందుకు రావాలని సవాల్ విసిరారు. మంత్రి పదవికి రాజీనామా చేయడం అంత సులభమైన విషయం కాదని, ఎన్నో కష్టాలు పడి ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచిన లక్ష్మణ్‌కు రాజీనామా చేసే ధైర్యమే లేదని ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలు, అవినీతి ఆరోపణలపై సమాధానాలు చెప్పలేక వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. హరీశ్‌రావును 'దొర' అంటూ కులాన్ని ప్రస్తావిస్తూ రాజకీయాలు చేస్తున్నావా? అంటూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హాయాంలో కరోనా లాంటి క్లిష్ట పరిస్థితుల్లో సైతం ఏనాడు ఆపలేదని గుర్తు చేశారు. రైతు భీమా ప్రీమియం గడువు పూర్తయి నాలుగు నెలలు అయిందని, రైతులు చనిపోతే ఆ కుటుంబాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. డిస్కం పేరుతో రైతులకు విద్యుత్తు కోతను తీసుకురానున్నారని ఆరోపించారు. రిజర్వాయర్లు, మెయిన్ కెనాల్స్ పూర్తి చేసి వేల ఎకరాలకు నీరిచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వముదేనని, పిల్ల కాలువలు పూర్తి చేస్తే మరిన్ని ఎకరాలకు నీరు అందించవచ్చున్నారు. అడుగడుగునా రైతులను వేధిస్తున కాంగ్రెస్ కి ఎవరైనా ఓటు వేస్తారా అంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టి వేధిస్తున్న కాంగ్రెస్ ఓటమి అంచున ఉందన్నారు. తెలంగాణ బాగుండాలంటే బీఆర్ఎస్ మళ్లీ గెలిచి కేసిఆర్ ముఖ్యమంత్రి కావాలని ఆయన అన్నారు.

# పట్టణంలోని 28, 29, 30, 31, 32 వార్డుల్లో నీటి సరఫరా నిలిపివేత

## - పురపాలక సంఘ ఇంజనీర్ వెంకటరమణ

తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 18 (ప్రజా వీక్షణం),

తాడేపల్లిగూడెం పట్టణంలోని 28, 29, 30, 31, 32 వార్డుల్లో శుక్రవారం సాయంత్రం నీటి సరఫరాను నిలిపివేయనున్నామని పురపాలక సంఘ ఇంజనీర్ వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు కడకట్ల రిజర్వాయర్ వద్ద అత్యవసర మరమ్మత్తు పనులు చేపట్టామని చెప్పారు. ఈ పనుల కారణంగా 28, 29, 30, 31, 32 వార్డుల్లో నీటి సరఫరా పూర్తిగా నిలిపివేయబడుతుందని, పనులు పూర్తయిన వెంటనే యథావిధిగా నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. సంబంధిత వార్డు ప్రజలు శుక్రవారం సాయంత్రానికి అవసరమైన తాగునీటిని ముందుగానే నిల్వ చేసుకోవాలని, నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

# జీనుగురాల పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం

దేవరకద్ర,జూన్ 18 ప్రజా వీక్షణం.

దేవరకద్ర మండల పరిధిలోని జీనుగురాల ప్రాథమికోన్నత పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ముందుగా సరస్వతీదేవి విగ్రహదాతలైన బాదం ప్రవీణ్ కుమార్ కుటుంబసభ్యులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం నూతనంగా ప్రీప్రైమరీలో చేరిన విద్యార్థులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగమ్మ సాయిలు, యువజన సంఘం నాయకులు విజయ్ కుమార్, మునీంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వేంకటేశ్వరాచారి, ఉపాధ్యాయులు వేంకటేశ్వరమ్మ, జి.అశోక్ కుమార్, పూడూరు నాగరాజు, భీంపల్లి శ్రీకాంత్, జి. విద్యాధర్ రెడ్డి, టి. విజయలక్ష్మి, బి.శోభిత తదితరులు పాల్గొన్నారు.





# టిఎంసికి హైకోర్టులో ఎదురుదెబ్బ

## రితబ్రత బెనర్జీ నియామకంపై సవాల్

## మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమన్న హైకోర్టు

కోల్‌కతా,జూన్18 (ప్రజా వీక్షణం)

తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా తిరుగుబాటుచేసిన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై కోల్‌కతా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చేందుకు నిరాకరించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ కృష్ణారావు నేతృత్వంలోని ధర్మాసనం.. తదుపరి విచారణ జరిపేంత వరకు స్పీకర్ నిర్ణయం అమలులో ఉంటుందని స్పష్టం చేసింది. ఈ పిటిషన్ తదుపరి విచారణకు ముందే అఫిడవిట్ల మార్పిడిని పూర్తి చేయాలని ఇరు పక్షాలను ఆదేశించింది న్యాయస్థానం. ప్రతివాదులు మూడు వారాల్లోగా తమ వ్యతిరేక అఫిడవిట్‌ను దాఖలు చేయాలని, దానిపై మరో పక్షం వారు రెండు వారాల్లోగా స్పందించాలని గడువు విధించింది. ఈ విషయంపై తదుపరి విచారణ జులై 28కి వాయిదా వేసింది. దీంతో ఈ కేసు ఫలితం వెలువడే వరకు రితబ్రత బెనర్జీ గుర్తింపు పొందిన ప్రతిపక్ష నేతగా కొనసాగనున్నారు. కాగా.. టీఎంసీ నుంచి బహిష్కృతమైన రితబ్రత బెనర్జీ.. ఆ పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు ఎమ్మెల్యేలకు న్యాయకత్వం వహిస్తున్నారు. దీంతో బెంగాల్ రాజకీయ సంక్షోభంలో వివాదం రాజుకుంది. తమకు 58 మంది టీఎంసీ ఎమ్మెల్యేల మద్దతుందని పేర్కొంటూ, ఆమె మేనల్లుడైన అభిషేక్ బెనర్జీకి వ్యతిరేకంగా ఓ చీలిక వర్గాన్ని ఏర్పాటు చేశారు రితబ్రత. అయితే.. తిరుగుబాటు వర్గం వాదనను అంగీకరిస్తూ రితబ్రతను ప్రతిపక్ష నాయకుడిగా ఆ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్ నియమించడంతో ఈ వివాదం మరింత ముదిరింది. స్పీకర్ నిర్ణయం అధికారికంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీని పక్కనపెట్టిందని, శాసనసభ పార్టీల గుర్తింపును నియంత్రించే రాజ్యాంగ నిబంధనల్ని ఉల్లంఘించిందని వాదిస్తూ.. దీదీ వర్గం కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

# హోంమంత్రి అనితపై గుడివాడ అమర్నాథ్ అనుచిత వ్యాఖ్యలు చేయటం దారుణం

## - దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు రవి ప్రకాష్

తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 18 (ప్రజా వీక్షణం)

ఏలూరులోని దళిత సేన రాష్ట్ర కార్యాలయంలో గురువారం దళిత సేన ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు బేతాళ జయసుధ అధ్యక్షతన దళిత సేన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవి ప్రకాష్ మాట్లాడుతూ దళిత హోంమంత్రి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ అనుచిత వ్యాఖ్యలు చేయటం దారుణమని, దళిత సేన తరుపున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. గుడివాడ అమర్నాథ్ వెంటనే దళిత హోంమంత్రి అనితకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడుకి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా దళిత సేన మహిళా కార్యదర్శి ముత్యాల ఝాన్సీ లక్ష్మి, పెదవేగి మండలం మహిళా అధ్యక్షురాలు రేమల్లె స్వర్ణకమలం తదితరులు పాల్గొన్నారు.



# నీట్ రీటెస్ట్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు

## వందతులను నమ్మొద్దని విద్యార్థులకు వినతి

## 21న రీ టెస్టు కోసం ఏర్పాట్లు పూర్తి: ఎన్‌టిఎ

న్యూఢిల్లీ,జూన్18 (ప్రజా వీక్షణం)

నీట్-యూజీ రీటెస్టును పకడ్బందీగా నిర్వహించేందుకు విస్తృతమైన ఏర్పాట్లు చేసినట్లు 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' ఎన్‌టిఎ తెలిపింది. విద్యార్థులు ప్రశాంతంగా ఉండి.. పరీక్ష సన్నద్ధతపై దృష్టి పెట్టాలని సూచించింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 21న రీటెస్టు ఉంటుందని.. పరీక్ష వాయిదా పడుతుందన్న వదంతులను, సోషల్ మీడియా వేదికగా జరిగే దుష్ప్రచారాన్ని నమ్మొద్దని 'ఎక్స్' వేదికగా సందేశం విడుదల చేసింది. ఎన్‌టీఏ నుంచి వచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని తెలిపింది. మరోవైపు.. పరీక్ష నిర్వహణపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అభ్యర్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే మే 3నాటి పరీక్షను రద్దు చేశాం. ఈ వ్యవహారం నుంచి పాఠాలు నేర్చుకుని పరీక్షా ప్రక్రియను మరింత బలోపేతం చేశాం. సంబంధిత మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, భద్రతా సంస్థల సమన్వయంతో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. పటిష్ఠమైన, బహుళ అంచెల భద్రతా చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. పరీక్ష సంబంధిత ఒత్తిడిని ఎదుర్కొంటున్న విద్యార్థులు 'మానస్' మానసిక ఆరోగ్య హెల్ప్‌లైన్ నంబర్‌ను (14416) సంప్రదించి సాయం కోరవచ్చని ఎన్‌టీఏ సూచించింది.పరీక్షకు ఇంకా మూడు రోజులే మిగిలి ఉన్నాయి. ఇప్పటికే సిద్ధమయ్యారు.. కాబట్టి అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడంపైనే దృష్టి పెట్టండి. ప్రశాంతంగా ఉండండి. బాగా విశ్రాంతి తీసుకోండి. మీ నుంచి ఇదే కోరుకుంటున్నాం అని అభ్యర్థులను ఉద్దేశించి ఎన్‌టీఏ పేర్కొంది. తల్లిదండ్రులు, అధ్యాపకులు కూడా.. విద్యార్థులను ప్రశాంతంగా ఉంచాలని, ధ్రువీకరించని సమాచారాన్ని వారితో షేర్ చేసుకోవద్దని విజ్ఞప్తి చేసింది. వారు స్థిరమైన మనసుతో, నిశ్చింతగా పరీక్షకు వెళ్లేలా చూడాలని సూచించింది. తెలిసిందే. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది.

# ముగిసిన బ్రహ్మానాయుడు కస్టడీ

## - కోర్టుకు తరలించిన పోలీసులు

హైదరాబాద్,జూన్18 (ప్రజా వీక్షణం)

ఫేక్ జీవో కేసులో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు కస్టడీ పూర్తయ్యింది. మూడురోజుల కస్టడీ ముగియడంతో బొల్లా బ్రహ్మానాయుడిని రంగారెడ్డి జిల్లా కోర్టుకు పోలీసులు తరలించారు. బ్రహ్మానాయుడిని సైబరాబాద్ ఈవోడబ్ల్యూ అధికారులు మూడు రోజులపాటు కస్టడీకి తీసుకొని విచారించారు. అయితే కస్టడీలో పోలీసులకు మాజీ ఎమ్మెల్యే ఏమాత్రం సహకరించనట్లు తెలుస్తోంది. ఏ ప్రశ్న అడిగినా 'తెలియదు, గుర్తులేదు' అనే సమాధానాలు చెప్పినట్లు సమాచారం. రూ.1000 కోట్ల భూమిని అక్రమంగా కొట్టేయాలని బ్రహ్మానాయుడు ఎ÷-లాన్ చేసినట్టు ఈవోడబ్ల్యూ అధికారుల విచారణలో వెల్లడైంది. భూమిని కొట్టేసేందుకు బ్రహ్మానాయుడు రూ.8 కోట్లు సమకూర్చినట్లు అధికారులు గుర్తించారు. దీనిపైనే ప్రశ్నలు వేయగా.. మాజీ ఎమ్మెల్యే సమాధానాలు దాటవేసినట్లు తెలుస్తోంది. మరికొన్ని ప్రశ్నలకు మౌనంగా ఉంటూ తనకేం తెలియదని బుకాయించే ప్రయత్నం చేసినట్లు సమాచారం. ఇప్పటికే ఐదుగురు నిందితులు కస్టడీలో వెల్లడించిన వివరాలను ఆధారంగా చేసుకొని బ్రహ్మానాయుడిని అధికారులు ప్రశ్నించారు. 'వారు చెప్పిన సమాధానాలకు నాకు ఎలాంటి సంబంధం లేదు' అని పోలీసుల ముందు బ్రహ్మానాయుడు బుకాయించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది.

# సన్నవడ్లకు పెరుగుతున్న ధరలు

## - కేసముద్రం మార్కెట్లో పెరిగిన కొనుగోళ్లు

మహబుబాబాద్,జూన్18 (ప్రజా వీక్షణం)

సన్న ధాన్యానికి మద్దతు పెరుగుతోంది. మార్కెట్లలో మద్దతు ధరలను మించి ధరలు పెంచి కొనుగోళ్లు చేస్తున్నారు. ఈయేడు సరిగా పంటలు పండకపోతే ధరలు పెరుగుతాయన్న భావనలో వ్యాపారులు ఉన్నారు. మహబుబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో ధాన్యం ధర ఈ సీజన్‌లో అత్యధికంగా క్వింటాకు రూ.2,906 నమోదైంది. గత 15 రోజులుగా ఈ మార్కెట్‌లో ఆర్ఎన్ఆర్ రకం వడ్లరేట్ రోజురోజుకూ పెరుగుతోంది. స్థానిక మార్కెట్‌కు ఈ- వేలం'లో క్వింటాకు గరిష్ఠంగా రూ.2,906, కనిష్ఠంగా రూ.2, 226, సగటున రూ.2,589 ధరలతో వ్యాపారులు ఖరీదులు చేశారు. ధాన్యానికి ప్రభుత్వ కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2,389 ఉండగా, ఈ సీజన్‌లో అంతకంటే ఎక్కువగానే మార్కెట్లో ధరలు ఉన్నాయి. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా ఉంటాయనే కారణాలతో వ్యాపారులు నిల్వ చేసేందుకు మార్కెట్లో ధాన్యం ఖరీదులు పెంచారు. ఈ క్రమంలో దేశీయంగా ధాన్యానికి డిమాండ్ ఏర్పడడంతో మార్కెట్లో ఈ సీజన్‌లో గత 15 రోజులుగా ధాన్యం సగటు ధర పెరుగుతూ వస్తోంది. ఈ నెల 1న ధాన్యం సగటు ధర రూ.2,475 నుంచి రూ.2,495 వరకు ఉన్నాయి. ఆ తర్వాత ఈనెల 4న సగటు ధర రూ.2, 589, 5న రూ.2636, 8న రూ.2,689, 9న రూ.2,729గా నమోదయ్యాయి. తాజా గా గరిష్ఠ ధర రూ.2,900 మార్కు దాటడం విశేషం.

# ఛత్తీస్‌ఘడ్‌లో ఇసుక తవ్వకాల పంచాయితీ

## - స్థానిక నేతను సజీవ దహనం చేసిన దుండగులు

రాయపూర్,జూన్18 (ప్రజా వీక్షణం)

ఛత్తీస్‌గఢ్‌లో ఇసుక తవ్వకాలకు సంబంధించి ఇరు వర్గాల మధ్య చెలరేగిన వివాదం దారుణ మలుపు తిరిగింది. స్థానిక నేత, జన్‌పద్ పంచాయతీ మాజీ ప్రెసిడెంట్ భరత్ సింగ్ సజీవదహనమయ్యారు. కొరియా జిల్లాలో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే నలుగురు నిందితులను అరెస్టు చేశారు. జాతీయ మీడియా కథనాల ప్రకారం, స్థానికంగా ఇసుక తవ్వకాల కాంట్రాక్ట్‌ను భరత్ సింగ్ దక్కించుకున్నారు. ఈ క్రమంలో మనోజ్ త్రిపాఠీ వర్గంతో భరత్ సింగ్‌కు వివాదం మొదలైంది. ఇసుక తవ్వకాల కోసం వాడే టిప్పర్ ట్రక్‌లు త్రిపాఠీ కుటుంబానికి చెందినవని స్థానికులు తెలిపారు. దీంతో, ఇసుక తరలింపు, చెల్లింపుల విషయంలో భరత్ సింగ్, త్రిపాఠీ వర్గాల మధ్య వివాదం మొదలైంది. చివరకు ఇది ఆధిపత్య పోరుగా మారినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. మంగళవారం రాత్రి ఇసుక తవ్వకాలకు సంబంధించి తలెత్తిన వివాదాన్ని పరిష్కరించేందుకు భరత్ సింగ్ నౌగెయిన్ గ్రామానికి వెళ్లారు. దీంతో, అక్కడ వివాదం చెలరేగగా భరత్ సింగ్ ప్రయాణిస్తున్న ఫార్చ్యూనర్ కారును కొందరు అడ్డగించారు. తప్పించుకునే వీలులేకుండా కారుకు ముందు, వెనుక లారీలను అడ్డుపెట్టారు. ఆ తరువాత కారుపై పెట్రలో పోసి నిప్పటించడంతో భరత్ సింగ్ సజీవదహనమయ్యారు. భరత్ సింగ్‌తో పాటు కారులో ఉన్న విరేంద్ర సింగ్, నాగేంద్ర సింగ్ కూడా కాలిన గాయాలతో కన్నుమూశారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన మయాంక్ సింగ్ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది.ఘటనపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని మృతుల కుటుంబం డిమాండ్ చేసింది. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ కేసులో ఇప్పటికే నలుగురిని అరెస్టు చేశామని ఏఎస్పీ సురేషా చౌబే తెలిపారు. మరికొందరు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో పట్టుకుంటామని అన్నారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ జర్నలిస్టులకు అవగాహన కార్యక్రమం

హైదరాబాద్,జూన్18 (ప్రజా వీక్షణం)

జర్నలిస్టుల కోసం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ అంశంపై తెలంగాణ మీడియా అకాడమీ, తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ అధికారులతో ప్రత్యేక అవగాహన మరియు పరస్పర చర్చా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ఈ నెల 22వ తేదీ సోమవారం నాడు ఉదయం 11.00 గంటలకు మీడియా అకాడమీ ఆడిటోరియం, చాపెల్ రోడ్, నాంపల్లి, హైదరాబాద్‌లో నిర్వహించబడుతుంది. ఈ సమావేశంలో ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ అధికారులు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పక్రియ, దాని లక్ష్యాలు, అమలు విధానం, ప్రజల భాగస్వామ్యం, ఓటరు నమోదు, సవరణలు తదితర అంశాలపై సమగ్రంగా వివరించనున్నారు. అలాగే జర్నలిస్టులు తమ సందేహాలను నేరుగా అధికారులను అడిగి నివృత్తి చేసుకునే అవకాశం కల్పించబడుతుంది. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 1.00 గంటలకు ముగియనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన జర్నలిస్టులు తమ పేర్లను 20వ తేదీ మధ్యాహ్నం 1.00 గంటలలోపు వాట్సాప్ నంబర్ 7093600977 కు పంపి నమోదు చేసుకోవలసిందిగా కోరడమైనది. కార్యక్రమ నిర్వహణ సౌలభ్యం దృష్ట్యా, నిర్దేశిత గడువులోపు తమ పేర్లను నమోదు చేసుకున్న జర్నలిస్టులకు మాత్రమే కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించబడుతుంది.

# ధర్మపురిలో విషాద ఘటన

## కోతుల కొట్లాటతో రాయిపడి మహిళ మృతి

జగిత్యాల,జూన్18 (ప్రజా వీక్షణం)

జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. కోతుల కొట్లాట ఓ మహిళ ప్రాణాన్ని బలి తీసుకుంది. మిద్దెపై కోతులు కొట్లాడుకుంటూ కింద ఉన్న మహిళ తలపై సిమెంట్ ఇటుక పడేశాయి. దీంతో ఆ మహిళ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. ధర్మపురిలోని కమలాపూర్ రోడ్డు ఇందిరమ్మ కాలనీకి చెందిన కొనపర్తి సత్యనారాయణ, పద్మ భార్యాభర్తలు. బుధవారం సాయంత్రం పద్మ ఇంటి ముందు కూర్చుని మరో మహిళతో మాట్లాడుతోంది. అదే సమయంలో ఇంటి రేకులపై కోతులు తీవ్రంగా గొడవపడసాగాయి. ఈ నేపథ్యంలోనే రేకులు గాలికి ఎగిరిపోకుండా ఉండటానికి బరువు కోసం పెట్టిన సిమెంట్ ఇటుకను కిందకు పడేశాయి. ఆ ఇటుక నేరుగా పద్మ తలపై పడింది. తలకు తీవ్ర గాయం అవ్వటంతో పద్మ అక్కడికక్కడే చనిపోయింది. ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# రాయదుర్గం భూముల వేలంపై హైకోర్టు స్టే

## - అందులో 5 ఎకరాలు తమవేనంటూ ఎస్‌బిఐ పిటిషన్

## - కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు

హైదరాబాద్,జూన్18 (ప్రజా వీక్షణం)

హైదరాబాద్ రాయదుర్గం భూముల వేలంపై తెలంగాణ హైకోర్టు స్టే విధించింది. మూడు వారాల పాటు స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మూడు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని ఈ సందర్భంగా ప్రతివాదులను న్యాయస్థానం ఆదేశించింది. రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1లోని భూమికి ఇటీవల వేలం నిర్వహించారు. ఈ స్థలాన్ని ఎకరాకు రూ.237కోట్ల చొప్పున గౌరా వెంచర్స్ కొనుగోలు చేసింది. అయితే, ఆ భూమిలో 5 ఎకరాలు తమదేనంటూ హైకోర్టును ఎస్బీఐ బ్యాంక్ ఆశ్రయించింది. ఈ మేరకు పిటిషన్ దాఖలు చేసింది. సర్వే నెంబర్ 83/1లోని 5 ఎకరాల భూమి తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేసింది. దీనిపై గురువారం విచారణ చేపట్టిన ధర్మాసనం.. రాయదుర్గం భూముల వేలంపై స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఎస్‌బీఐ, టీజీఐఐసీ, గౌర వెంచర్స్‌కు నోటీసులు జారీ చేసింది. రాయదుర్గంలోని పన్మక్తలో టీజీఐఐసీ జరిపిన భూముల వేలంపై ఇటీవల ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించింది. ఆ భూములు తమవేనంటూ పిటిషన్ దాఖలు చేసింది. దీంతో విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం వేలంపై స్టే విధించింది. ఇటీవల జరిగిన వేలంలో అక్కడ ఎకరం రూ.237 కోట్లు పలికిన సంగతి తెలిసందే. సర్వే నం.83/1లో ఐదు ఎకరాల భూమిపై హక్కులు కోరుతూ ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించింది. మే 6న జారీ చేసిన వేలం నోటిఫికేషన్‌తోపాటు తదనంతరం జరిగిన భూ విక్రయాన్ని, తమ వినతిపత్రాన్ని తిరస్కరిస్తూ మే 20న జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ ఎస్‌బీఐ రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేసింది. రాయదుర్గంలో ఎస్‌బీహెచ్‌కు 2010లో ఐదెకరాల భూమిని ప్రభుత్వం కేటాయించగా ఇందుకోసం రూ.13.33 కోట్లను చెల్లించింది. ఎస్‌బీఐలో ఎస్‌బీహెచ్ విలీనం కాగా, గతంలో ఈ స్థలంలో ఉన్న రెండు ఏటీఎంలను ఎస్‌బీఐ నిర్వహిస్తోంది. 2020లో గత ప్రభుత్వం భూకేటాయింపును రద్దు చేయగా ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించింది. కేటాయింపు ఉత్తర్వులను రద్దు చేస్తూ.. ఎస్‌బీఐ అభ్యర్థనను పునఃపరిశీలించాలని హైకోర్టు ఆదేశించింది. అనంతరం 2024లో ప్రస్తుత ప్రభుత్వం కూడా ఈ కేటాయింపును రద్దు చేయడంతో ఎస్‌బీఐ మరోసారి హైకోర్టును ఆశ్రయించింది.

# కొత్త డార్క్ వెబ్‌గా టెలిగ్రామ్ యాప్

## నేరగాళ్లకు అడ్డాగా మారిన మెసేజింగ్ ప్లాట్‌ఫామ్

## కేంద్రప్రభుత్వం సంచలన ఆరోపణలు

## ఢిల్లీ హైకోర్టుకు నివేదిక సమర్పణ

న్యూఢిల్లీ,జూన్18 (ప్రజా వీక్షణం)

మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్‌పై కేంద్రం సంచలన ఆరోపణలు చేసింది. ఈ యాప్‌ను 'కొత్త డార్క్ వెబ్'గా పేర్కొన్న కేంద్రం.. ఇది నేరగాళ్లకు అడ్డగా మారిందని ఆరోపించింది. సైబర్ నేరగాళ్లు, అతివాదులు, డ్రగ్ ముఠా సభ్యులు చట్టం నుంచి తప్పించుకునేందుకు ఈ యాప్ ను ఎక్కువగా వినియోగిస్తున్నారని దుయ్యబట్టింది. ఈ మేరకు దిల్లీ హైకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది.నీట్ రీఎగ్జామ్ నేపథ్యంలో దేశంలో టెలిగ్రామ్ వినియోగంపై కేంద్రం ఇటీవల తాత్కాలిక నిషేధం విధించిన సంగతి తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ దిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసు విచారణలో భాగంగా కేంద్రం గురువారం అఫిడవిట్ దాఖలు చేసింది. నీట్ యూజీ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా దుమారం లేపిన నేపథ్యంలో.. జూన్ 21న రీటెస్ట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ పరీక్షకు సంబంధించిన కొన్ని ముఠాలు టెలిగ్రామ్ వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ఇటీవల దీనిపై కేంద్రం తాత్కాలిక నిషేధం విధించింది. ప్రశ్నపత్రాల లీకేజీ, తప్పుడు వార్తల వ్యాప్తిని నివారించేందుకు, మోసపూరిత నెట్‌వర్క్‌లను అరికట్టడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం తెలిపింది. జూన్ 22 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించింది.

ఈ సందర్భంగా క్రిమినల్ నెట్‌వర్క్‌లు, అతివాద ముఠాలు, సైబర్ నేరగాళ్లు ఈ యాప్‌ను దుర్వినియోగం చేస్తున్న తీరును కేంద్రం అందులో వివరించింది. గోప్యతకు సంబంధించి టెలిగ్రామ్‌లో ఉన్న అధునాతన ఫీచర్లు క్రిమినల్ నెట్‌వర్క్‌లను ఎక్కువగా ఆకర్షిస్తున్నాయని పేర్కొంది. ఇందులోని ప్రైవసీ సెట్టింగ్‌లతో యూజర్లు తమ టెలిగ్రామ్ ఐడీలు, ఫోన్ నంబర్లు వంటి గుర్తింపు వివరాలను దాచిపెట్టేందుకు వీలు లభిస్తోంది. దీనివల్ల అసలు వ్యక్తులు ఎవరో గుర్తించడం దర్యాప్తు అధికారులకు కష్టంగా మారుతోంది. ఈ ఫీచర్ల వల్లే నేరగాళ్లు ఈ యాప్‌ను దుర్వినియోగం చేసి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, దోపిడీ, ఉగ్రదాడులు, మోసాలు వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇది కొత్త డార్క్ వెబ్‌గా మారింది. క్రిమినల్స్ డార్క్ వెబ్ లింక్‌లతో పరస్పరం అనుసంధానం చేసుకుంటున్నారు. దీంతో అధికారులు వారిని ట్రాక్ చేయలేక పోతున్నారని కేంద్రం తమ అఫిడవిట్‌లో ఆరోపించింది. ఇక, హింసాత్మక, తీవ్రవాదం, ఉగ్రవాద సంస్థలకు సంబంధించిన కంటెంట్‌ను ప్రచారం చేయడానికి టెలిగ్రామ్ గ్రూపులు, ఛానెళ్లను ఉపయోగిస్తున్నారని కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల తప్పుడు సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతోందని, ఫలితంగా శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతోందని ఆరోపించింది. పిల్లలపై లైంగిక దాడుల వంటి దృశ్యాలను ఈ యాప్ గ్రూప్‌ల్లో విపరీతంగా షేర్ చేస్తున్నట్లు తెలిపింది. సైబర్ నేరగాళ్లు ఈ వేదికపై నకిలీ ఖాతాలను సృష్టించి.. ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని మండిపడింది. ఈ మెసేజింగ్ ఎ÷-లాట్‌ఫామ్ దుర్వినియోగంపై ఇటీవలి కాలంలో నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌కు ఫిర్యాదులు పెరిగినట్లు పేర్కొంది. హ్యాకర్ గ్రూప్‌లు కూడా ఈ టెలిగ్రామ్ ఛానళ్లను ఉపయోగించి పెద్ద ఎత్తున డేటా చౌర్యానికి పాల్పడుతున్నట్లు కేంద్రం తన అఫిడవిట్‌లో వెల్లడించింది. అంతేగాక, యూజర్ల వ్యక్తిగత డేటా అయిన మొబైల్ నంబర్లు, ఆధార్ వివరాలు, ఇతర సున్నితర సమాచారాన్ని యాక్సెస్ చేసేలా టెలిగ్రామ్ బాట్స్ పనిచేస్తుండటంపై కేంద్రం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మాధ్యమంలో పైరసీ సినిమాలు, వెబ్ సిరీస్‌లు, కాపీరైట్ కంటెంట్ కూడా ప్రసారమవుతున్న విషయాన్ని కేంద్రం కోర్టు దృష్టికి తీసుకెళ్లింది.

# అబద్దాలు చెప్పడం, మోసాలు చేయడం అలవాటే

## అభివృద్ధిని అడ్డుకోవడమే జగన్ పార్టీ పని

## మండిపడ్డ మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఒంగోలు,జూన్18 (ప్రజా వీక్షణం)



మోసం చేయడం, అబద్దాలు చెప్పడం జగన్ రెడ్డి పార్టీకే సొంతమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ప్రకాశం జిల్లాలో గురువారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. 'నమ్మకం, అభివృద్ధి, సంక్షేమంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ఇచ్చిన హామీలతోపాటు అభివృద్ధి చేసి చూపించడంతో కూటమిపై ప్రజల్లో నమ్మకం ఏర్పడింది. పెన్షన్ల కోసం రూ.33 వేల కోట్లు ఖర్చు పెడుతున్నాం. విద్య కోసం రూ.10 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. ఇచ్చిన మాట ప్రకారం 16 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం' అని అన్నారు. వైసీపీకి ఒక్క ఓటు వేసిన పాపానికి ఆంధ్రప్రదేశ్ ఐదేళ్లు నాశనమైందనిఆవేదన వ్యక్తం చేశారు. అధికారం ఇచ్చిన ఐదేళు వైఎస్ జగన్ ఇంట్లో నిద్రపోయారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తాము చేస్తున్న అభివృద్ధిని తన ఖాతాలో వేసుకోవాలని జగన్ కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక తట్ట మట్టి కూడా వేయలేదని మంత్రి గొట్టిపాటి ఆరోపించారు. నాడు ఒక్క ప్రాంతంలోనూ రహదారి నిర్మాణం చేపట్టలేదని, వెలిగొండ లాంటి ప్రాజెక్టు అభివృద్ధిని కూడా అడ్డుకున్నారంటూ వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశానంటూ ప్రజలను మోసం చేశారంటూ జగన్‌పై గొట్టిపాటి విమర్శలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భారీ నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రతి నెలా వెలిగొండ ప్రాజెక్టును పరిశీలిస్తున్నారని మంత్రి తెలిపారు. వెలిగొండ ముంపు గ్రామాల ప్రజలకు రూ.900 కోట్ల నిధులు మంజూరు చేశారని వివరించారు. రాబోయే రోజుల్లో కూటమిలోని పార్టీల నేతలు ఇంటింటికీ తిరిగి ప్రజలతో మమేకమవుతారని ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి చెప్పారు.

# ప్రకృతి వ్యవసాయాన్ని పెద్దగా ప్రోత్సహిస్తున్నాం

## మత్స్యకారుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం

## కృష్ణా జిల్లాలను ఆదర్శంగా దిద్దే పనిలో ఉన్నాం

## జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్

అమరావతి,జూన్18 (ప్రజా వీక్షణం)

ప్రకృతి వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. పశుసంవర్ధక రంగంలో ఇంటి వద్దకే పశువైద్య సేవలు అందిస్తున్నా మని చెప్పారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పరిశ్రమల రంగంలో కృష్ణా జిల్లా విశేష పురోగతి సాధించిందని చెప్పుకొచ్చారు. కృష్ణా జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కృష్ణా జిల్లా అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ సహకారంతో సంక్షేమం - అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ కింద 1.33 లక్షల రైతు కుటుంబాలకు రూ.252.94 కోట్ల పెట్టుబడి సాయం అందించామని తెలిపారు. రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగించేందుకు 29 కిసాన్ డ్రోన్లను సబ్సిడీపై అందించామన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. విద్యారంగంలో చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నామని, మెగా డీఎస్సీ ద్వారా 1,203 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా 1.98 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కల్పించామని అన్నారు. ఆరోగ్య రంగంలో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా ప్రతి నెల 2.30 లక్షల మందికి ప్రయోజనం అందుతోందని వెల్లడించారు. మహిళా సాధికారత కోసం డ్వాక్రా, స్త్రీనిధి ద్వారా వేల కోట్ల రుణాలు అందించామని మంత్రి తెలిపారు. రెవెన్యూ శాఖ ద్వారా భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. 1.27 లక్షలకుపైగా భూ హక్కు పత్రాలను పంపిణీ చేశామని తెలిపారు. డ్రగ్స్ నిర్మూలనకు పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటోందని వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో కృష్ణా జిల్లా ఆదర్శంగా నిలుస్తోందన్నారు. పేదలకు గృహ వసతి కల్పించడంలో ప్రభుత్వం చరిత్ర సృష్టిస్తోందన్నారు. మచిలీపట్నం పోర్టు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారనుందని తెలిపారు. పోర్టు, ఫిషింగ్ హార్బర్ ప్రాజెక్టులు పూర్తయితే వేలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కృష్ణా జిల్లాను పారిశ్రామిక, వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనిక నాయకత్వంలో కృష్ణా జిల్లా అభివృద్ధిలో కొత్త శిఖరాలను అధిరోహిస్తోందన్నారు. సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని తెలిపారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# వైసిపి అసత్య ప్రచారాలను నమ్మవద్దు

## - ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్



**తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 18 (ప్రజా వీక్షణం)**

గద్దె సాయికృష్ణ అదృశ్య ఘటనతో కూటమికి ఎలాంటి సంబంధం లేదని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అసత్య ప్రచార ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ప్రభుత్వ విప్, శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ స్పష్టం చేసారు. స్థానిక కార్యాలయంలో గురు వారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం నిరాధార ఆరోపణలు చేస్తూ వైసీపీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని మండిపడ్డారు. గద్దె సాయికృష్ణ వ్యవహారంపై ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారని, ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ నాగరాజును వెంటనే సస్పెండ్ చేసి విచారణకు ఆదేశించడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. తమ ప్రభుత్వం ఆరోపణలు వచ్చిన వెంటనే చర్యలు తీసుకుందని, వైసీపీ హయాంలో ఇలాంటి పారదర్శకత ఎప్పుడూ కనిపించలేదన్నారు. నిన్న వైసీపీ నేత అంబటి నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో గద్దె సాయి కృష్ణ ఫోటోలంటూ విడుదల చేసిన రక్తపు మడుగులో ఉన్న ఫోటోలు పూర్తిగా ఫేక్ అంటూ కొట్టి పారేశారు. గద్దె సాయికృష్ణ ఫోటోలని చూపించిన చిత్రాలు మీకు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు చెప్పాలని అంబటిని నిలదీసారు. నిజంగానే ఫోటోలు మీ వద్దకొచ్చి ఉంటే బాడీ ఎక్కడ ఉందో కూడా మీకు తెలిసి ఉండాలి కదా అని సూటిగా ప్రశ్నించారు. అసలు ఆ ఫోటోలు ఎవరు పంపారు, వాటి మూలం ఏమిటి, అనే ప్రశ్నలకు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అవి నిజమైన ఫోటోలేనని ఆధారాలతో నిరూపించాలని వైసీపీ నేతలకు సవాల్ విసిరారు. సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న ఫేక్ ఫోటోలతో ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలను రాజకీయాల కోసం వాడుకోవడం వైసిపి దుర్మార్గపు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేస్తున్నారని, అసలు నిజాలు త్వరలోనే వెలుగులోకి వస్తాయని చెప్పారు. గద్దె సాయికృష్ణ కుటుంబానికి న్యాయం జరగాలని, వాస్తవాలు వెలుగులోకి రావాలని ఆకాంక్షించారు. ఆధారాలు లేకుండా కూటమి ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నాలను ప్రజలు క్షమించరన్నారు. అసత్య ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని, ఈ ఘటనలో వాస్తవాలు వెల్లడైన తరువాత వైసిపి తప్పుడు రాజకీయం బయటపడుతుందన్నారు. గద్దె సాయికృష్ణ ఎక్కడ ఉన్నా క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. కేసు విచారణ పూర్తయ్యే వరకు ఊహాగానాలు, దుష్ప్రచారాలను నమ్మవద్దని ప్రజలను కోరారు.

# ప్రభుత్వ భూముల కబ్జా నిరోధానికే హైడ్రా

- పేదల జోలికి వెళ్లకుండా..కబ్జాదారుల భరతం పడుతోంది
- హైదరాబాద్ కాలుష్యం నివారించేందుకే వనమహోత్సవం
- ఎవరు అడ్డుపడ్డా మూసీ ప్రక్షాళన కొనసాగుతుంది
- మూసీ మురికి కన్నా కల్వకుంట్ల విషం ప్రమాదం
- గుర్రంగూడ ఎకో పార్క్‌లో వనమహోత్సవం
- మొక్కను నాటి ప్రసంగించిన సిఎం రేవంత్ రెడ్డి



**రంగారెడ్డి,జూన్18 (ప్రజా వీక్షణం)**

ఎవరైనా ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కబ్జాలతో ప్రజలకు సమస్యలు రాకూడదనే హైడ్రా తీసుకువచ్చామని ప్రస్తావించారు. హైడ్రాను ఒక భూతంలా కొందరు చూపెడుతు న్నారని ధ్వజమెత్తారు. హైడ్రా పేదల జోలికి వెళ్లదని.. కబ్జాదారుల భరతం పడుతుందని స్పష్టం చేశారు. గుర్రంగూడ ఎకో పార్క్‌ను కబ్జా చేయాలని కొంతమంది చూశారని ఆరోపించారు. వనస్థలిపురంలో దేవుడి భూములనూ కూడా కబ్జా పెట్టారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గుర్రంగూడ ఎకో పార్క్‌లో వన మహోత్సవం కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. హరితనిధి ద్వారా నాగలింగం మొక్కను ముఖ్యమంత్రి నాటారు. రోబోటిక్ ఏనుగును ఆవిష్కరించారు. ఈ క్రమంలో గుర్రంగూడ ఎకో పార్క్ నమూనాను అటవీ అధికారులు.. సీఎంకి వివరించారు. ఎకో పార్క్‌లో రూ.35.50 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో రూ.17.84 కోట్లతో అభివృద్ధి పనులని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 2018లో కొందరి కుట్ర వల్ల కొడంగల్‌లో ఓడిపోయానని చెప్పుకొచ్చారు. ఇక తాను ఏమీ చేయలేనని కొందరు భావించారని అన్నారు. మల్కాజ్‌గిరి ప్రజలు తనను ఎంపీగా గెలిపించారని తెలిపారు. ప్రశ్నించే గొంతు ఉండాలని నాడు ఎంపీగా తనను గెలిపించారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తనను ఓడించాలని కొందరు ఎన్నో కుట్రలు పన్నారని ధ్వజమెత్తారు. ఇక్కడి ప్రజల అభిమానమే తనను ముఖ్యమంత్రిగా నిలబెట్టిందని వివరించారు. ఎల్బీనగర్ ప్రజలు తనకు 30 వేలకుపైగా ఓట్ల మెజారిటీ ఇచ్చారని అన్నారు. తన సొంతూరు కొండారెడ్డిపల్లి లాంటిదే తనకు ఎల్బీనగర్ అని అభివర్ణించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎల్బీనగర్ అభివృద్ధిని పట్టించుకోలేదని మండిపడ్డారు. సీఎంగా ఎల్బీనగర్ సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని మాటిచ్చారు. రంగారెడ్డి జిల్లాకు అన్నివిధాలా అండగా నిలుస్తున్నామని స్పష్టం చేశారు. కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకుని ఢిల్లీ ప్రజలు బాధపడుతున్నారని సీఎం వ్యాఖ్యానించారు. మన హైదరాబాద్‌కు అలాంటి పరిస్థితి రావొద్దనే మొక్కల పెంపకాన్ని ప్రోత్సాహిస్తున్నామని వివరించారు. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే కొందరు అడ్డుపడుతున్నారని ఆగ్రహించారు. మూసీ ఒడ్డున నివసిస్తున్న ప్రజలను తరలించి.. అభివృద్ధి చేస్తామంటే కొందరు మోకాలడ్డుతున్నారని మండిపడ్డారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ కడతామంటే మళ్లీ ఫార్మా కంపెనీలు తెస్తామంటున్నారని చెప్పుకొచ్చారు. ఫ్యూచర్ లేనివాళ్లు ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామంటున్నారని దుయ్యబట్టారు. ముందు సిద్దిపేట గెలిచిరండి.. ఆ తర్వాత రద్దుపై మాట్లాడదామని హితవు పలికారు. 60 శాతం గ్రీనరీ పెంచుతామంటే కేసులు వేశారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరేమనుకున్నా మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతామని రేవంత్‌రెడ్డి అన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ మేర ఈ పనులు చేపడతామని చెప్పారు. సబర్మతి, గంగా రివర్‌ఫ్రంట్‌ల కంటే మెరుగ్గా అంతర్జాతీయ స్థాయిలో దీన్ని తీర్చిదిద్దుతామన్నారు. కాలుష్య రహిత వాతావరణం ప్రజలకు ఇవ్వాలని ప్రయత్నిస్తున్నాం. నగర అవసరాల కోసం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ఫ్యూచర్ లేని నేతలు ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని చెబుతున్నారు. వాళ్ల ఫ్యూచర్‌ను ప్రజలు నిర్ణయిస్తే.. ఫాంహౌస్‌కు పరిమితమయ్యారు. ఫ్యూచర్‌సిటీని రద్దు చేస్తానన్న ఆయన ఈసారి సిద్దిపేటలో గెలవరు. కొందరు ఎన్జీటీలో కేసులు వేస్తున్నారు. మూసీలో కాలుష్యం కంటే.. కల్వకుంట్ల వాళ్ల కడుపులో కాలుష్యమే ఎక్కువ. ఎవరు అడ్డుపడినా అంతర్జాతీయస్థాయిలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతాం అని అన్నారు. కేసీఆర్ ఫ్యామిలీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. గుర్రంగూడలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులను వర్చువల్ గా ప్రారంభించారు సీఎం రేవంత్. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే అడ్డుపడుతున్నారని.. మూసీలో ఉండే కాలుష్యం కంటే కల్వకుంట్లోళ్ల కడుపులో విషం ఎక్కువని అన్నారు. మూసీ పునరుజ్జీవం వద్దంటున్న సుధీర్ రెడ్డి గతంలో మూసీ కార్పొరేషన్ చైర్మెన్ పదవి ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు. భూకబ్జాలతో ప్రజలకు సమస్య రావొద్దని హైడ్రా తెచ్చామని... హైడ్రాను భూతంలా చూపిస్తున్నారని మండిపడ్డారు. హైడ్రా పేదల జోలికి వెళ్ళదని.. కబ్జాదారుల భరతం పడుతుందని అన్నారు. ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకొని ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. మన హైదరాబాద్ కు ఆ పరిస్థితి రావొద్దని మొక్కల పెంపకం చేపట్టామని అన్నారు.

# వెన్నుపోటు రాజకీయాలు జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య

- కులలాల మధ్య తగవులు పెఓట్టడం ఆయనకే చెల్లింది
- హోంమంత్రి అనితపై గుడివాడ వ్యాఖ్యలు దారుణం
- మాజీమంత్రి సోమిరెడ్డి ఘాటు విమర్శలు



**నెల్లూరు,జూన్18 (ప్రజా వీక్షణం)**

వెన్నుపోటు పేరుతో ర్యాలీలు నిర్వహిస్తున్న జగన్ ముందుగా తన రాజకీయ చరిత్రను చూసుకోవాలని మాజీమంత్రి, టిడిపి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. మద్యనిషేధం సహా అన్ని హామీలు విస్మరించిన జగన్‌కు, కూటమి మేనిఫెస్టో గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. మతాల మధ్య చిచ్చుపెట్టే కుట్రలు పారనివ్వకపోవడంతో కులాల మధ్య తగవులు పెట్టేందుకు సిద్ధమయ్యాడని ఆరోపించారు. జగన్‌కు దమ్ముధైర్యం ఉంటే డీఎస్సీలో అక్రమాలపై ఆధారాలతో చర్చకు రావాలని లోకేశ్ చేసిన సవాల్ స్వీకరించాలన్నారు. రొయ్యల ఫీడ్ కంపెనీలకు జగన్ కులం ఆపాదించడం సిగ్గుచేటన్నారు. అనితను రాజకీయంగా ఎదుర్కోలేక వైసీపీ నీచ రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. తమ ఇంట్లోనూ మహిళలు ఉన్నారనే విజ్ఞత మరిచి గొడ్డలి పార్టీ నేతలు మాట్లాడుతున్నారని అన్నారు. అమర్నాథ్ వ్యాఖ్యలపై జగన్ రాష్ట్ర మహిళలకు, హోంమంత్రికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆస్తి కోసం తల్లి, చెల్లిని కూడా వెన్నుపోటు పొడిచిన ఘనుడు జగన్ అని విమర్శించారు. రాష్ట్రంలో సామాజిక సామరస్యాన్ని దెబ్బతీయడానికి కుట్రలు చేస్తున్నారని, ఏదైనా సంఘటన జరిగితే.. దానికి కులం రంగు పులిమి ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కులాల మధ్య చిచ్చు పెట్టడమనేది జగన్ డీఎన్ఏలోనే ఉందని విమర్శించారు. కుల చిచ్చులో భాగంగానే గుడివాడ అమర్నాథ్ హోం మంత్రి అనితపై దిగజారుడు వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. అనితకు గుడివాడ అమర్నాథ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత మహిళ అనిత హోంమంత్రిగా ఎదగడాన్ని సహించడం లేదన్నారు. మహిళల పట్ల జగన్‌కు, గొడ్డలి పార్టీ నేతలకు ఉన్న గౌరవం ఏపాటిదో రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందని పేర్కొన్నారు. హోం మంత్రి అనితను రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిత్వ హననానికి పాల్పడటం దారుణమన్నారు. మహిళా నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ విమర్శలు విధానాలపై ఉండాలి కానీ వ్యక్తిత్వ హననానికి దిగడం వైసీపీ సంస్కృతికి నిదర్శమని అన్నారు. ప్రజాసమస్యలపై మాట్లాడలేని వారు వ్యక్తిగత దూషణలతో రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నారని విమర్శించారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం అవసరం

## - కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 18 (ప్రజా వీక్షణం న్యూస్)**

మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిర్మూలన లక్ష్యంగా జూన్ 19 నుంచి 25 వరకు జిల్లాలో "నషా ముక్త సప్తాహం" నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి తెలిపారు. కార్యక్రమాల ప్రారంభంలో అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ వారంలో పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు, క్విజ్, డ్రాయింగ్, స్లోగన్ రైటింగ్ పోటీలు నిర్వహించనున్నారు. జూన్ 25న భారీ అవగాహన ర్యాలీ చేపట్టనున్నట్లు వెల్లడించారు. మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



# నీట్ ఎగ్జామ్ విద్యార్థులకు ఉచిత ప్రయాణం

## - రవాణామంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**హైదరాబాద్,జూన్18 (ప్రజా వీక్షణం)**

నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన చేశారు . జూన్ 21న జరగనున్న నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత ప్రయాణం అందిస్తున్నట్లు ప్రకటించారు . పరీక్షా రాసే విద్యార్థులు హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది నీట్ పరీక్ష కోసం.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కీలక మార్పులను ప్రకటించింది. ఎగ్జామ్ ను మరింత పారదర్శకంగా, సురక్షితంగా, విద్యార్థులకు అనుకూలంగా మార్చేందుకు ఎన్టీఏ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. గతంలో ఉన్న నిబంధనలను సవరిస్తూ ఈసారి ఎగ్జామ్ టైంను 195 నిమిషాలకు పెంచారు. ఎగ్జామ్ మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు జరగనుంది. ఎగ్జామ్ ప్రారంభానికి ముందు అటెండెన్స్ డాక్యుమెంట్స్ పై సైన్‌లు చేయడం, ఇన్విజిలేషన్ లాంఛనాలు పూర్తి చేయడం వంటి పరిపాలనాపరమైన పనుల వల్ల.. విద్యార్థులు తమకు కేటాయించిన రాత సమయాన్ని నష్టపోకూడదనే ఉద్దేశంతో ఎన్టీఏ ఈ అదనపు సమయాన్ని కేటాయించింది. దీనివల్ల అభ్యర్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్ష రాయడంపైనే పూర్తిగా దృష్టి పెట్టవచ్చు. ఎగ్జామ్ రోజున విద్యార్థులకు పూర్తి స్పష్టత, సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా తెచ్చిన ఈ కొత్త నిబంధనలను అభ్యర్థులందరూ గమనించాలని ఎన్టీఏ స్పష్టం చేసింది.

# సాయికృష్ణ అదృశ్యం కేసు విచారణాధికారిగా రాజమండ్రి ఎస్పీ

**విజయవాడ,జూన్18 (ప్రజా వీక్షణం)**

నగరంలో సంచలనం రేపుతున్న రౌడీషీటర్ సాయికృష్ణ అదృశ్యం కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణాధికారిగా రాజమండ్రి ఎస్పీ నరసింహ కిషోర్‌ను అధికారులు నియమించారు. కేసుపై వస్తున్న ఆరోపణలు, ప్రజల్లో నెలకొన్న అనుమానాల నేపథ్యంలో ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. సాయికృష్ణ అదృశ్యంపై ఇప్పటికే పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో సాయికృష్ణను అదుపులోకి తీసుకున్న అనంతరం కనిపించకుండా పోయాడని.. అతడ్ని స్టేషన్లో లాకప్ డెత్ చేశారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాజమండ్రి ఎస్పీ నరసింహ కిషోర్‌ను దర్యాప్తు అధికారిగా నియమిస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. గురువారం ఎస్పీ.. కృష్ణలంక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. విచారణలో భాగంగా పలువురు పోలీసు సిబ్బందిని ప్రశ్నించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. సాయికృష్ణ అదృశ్యంపై తల్లి విజయలక్ష్మి తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. 'సాయికృష్ణ బతికి ఉన్నాడో లేదో' తెలిపాలని కోరుతున్నారు. అంతేకాకుండా సాయికృష్ణ మిస్సింగ్ కేసులో స్థానిక పోలీసుల దర్యాప్తుపై కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసులో సీబీఐ దర్యాప్తు జరిపించాలని కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు.

# రాధాగాయత్రి మృతిపై తల్లి అనుమానం

- అల్లుడే హత్య చేసి ఉంటాడని ఆరోపణ
- లోతైన దర్యాప్తు చేస్తే నిజాలు వస్తాయని వెల్లడి

**విశాఖపట్నం,జూన్18 (ప్రజా వీక్షణం)**

విశాఖకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రాధా గాయత్రి మృతి కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. భర్తతో కలిసి ఉత్తరాఖండ్ వెళ్లిన గాయత్రి అనుమానాస్పదస్థితిలో మరణించింది. గాయత్రి మృతి పట్ల అనుమానం వ్యక్తం చేస్తున్న తల్లి సత్యవతి.. దీనిపై విశాఖ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. తన అల్లుడు శ్రీచరణ్‌పైనే అనుమానం ఉందన్నారు. ఈ కేసులో పోలీసులు లోతైన దర్యాప్తు చేస్తే అనేక విషయాలు బయటపడతాయని తల్లి సత్యవతి చెప్పారు. 'నా కూతురి మృతి విషయంలో అల్లుడుపైనే అనుమానం. నా కూతురికి మద్యం సేవించే అలవాటు లేదు. గాయత్రిపై అనుమానంతోనే హత్య చేసి ఉండొచ్చు. రిషికేశ్, హరిద్వార్ వెళుతున్నామని చివరిసారిగా నాకు చెప్పింది. విహారయాత్ర ముగించుకొని విశాఖకు వస్తానని చెప్పింది. విశాఖకు రాకుండానే నా కూతుర్ని హతమార్చారు. విశాఖకు వచ్చిన తర్వాత రెండు నెలలు వర్క్ ఫ్రం హోం పెట్టి ఇక్కడే ఉంటాను అని చెప్పింది. నా కూతురి విషయంలో మీడియా నాకు న్యాయం చేయాలి. మాది సాంప్రదాయమైన కుటుంబం అని తల్లి సత్యవతి ఆవేదన వ్యక్తం చేసింది.

ప్రజావీక్షణం దినపత్రిక
GENERAL NEWS
19 శుక్రవారం, జూన్ 2026
9
www.prajaveekshanam.in

# అబవిద్యాప్రమాణాలు పెంపొందించుకోవాలి

## - జిల్లా విద్యాధికారి ప్రశాంత్ రెడ్డి సూచన

కరీంనగర్,జూన్18 (ప్రజా వీక్షణం)

విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంపొందించుకోవాలని జిల్లా విద్యాధికారి ప్రశాంత్ రెడ్డి అన్నారు. చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట గదులను, పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం, పాఠ్యపుస్తకాలు, నోట్స్ పంపిణీ, ల్యాబ్, మొదలు రికార్డులను పరిశీలించారు. అనంతరం పదవ తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు విద్యపై ప్రత్యేక దృష్టి సారించి విద్యా ప్రమాణాలు పెంపొందించుకోవాలన్నారు. సెల్ఫోన్, సినిమాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జయప్రద, ఉపాధ్యాయులు మంజుల, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం

## - పవన్ ఆదేశాలతో అటవీశాఖ ప్రత్యేక దృష్టి

కాకినాడ,జూన్18 (ప్రజా వీక్షణం)

తునిలో చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రోజులు గడుస్తున్నా చిన్నారి జాడ లభించకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారి ఆచూకీ కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు అటవీ శాఖ, ప్రత్యేక హనుమాన్ టీమ్ సంయుక్తంగా థర్మల్ డ్రోన్ల సహాయంతో సెర్చింగ్ ఆపరేషన్‌ను నిర్వహిస్తున్నాయి. రాత్రి వేళల్లోనూ పాప కోసం విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. థర్మల్ డ్రోన్ల ద్వారా అటవీ జంతువుల కదలికలపైనా అధికారులు నిఘా పెట్టారు. చిన్నారిని అడవి జంతువులు ఎత్తుకెళ్లి ఉండవచ్చన్న అనుమానంతో.. ఆ కోణంలోనూ గాలింపు కొనసాగుతోంది. అటవీ ప్రాంతాల్లో జంతువుల కదలికలను గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. చిన్నారి జాడను కనిపెట్టడం కోసం పోలీసులు ఇప్పటికే రెండు బొమ్మలను వేలాడదీసి, వాటిలో మాంసం ఎరగా ఉంచారు. ఇప్పటివరకు ఎలాంటి జంతువుల జాడ కానరాకపోవడం గమనార్హం. చిన్నారి ఆచూకీ కోసం అన్ని కోణాల్లోనూ దర్యాప్తు కొనసాగుతోంది. పాప క్షేమంగా తిరిగి రావాలని తల్లిదండ్రులతో పాటు స్థానిక ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

# ఏపీ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదల

అమరావతి,జూన్18 (ప్రజా వీక్షణం)

ఏపీ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ ద్వారా లేదా మనమిత్ర వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా తెలుసుకోవచ్చు. విద్యార్థులు తమ హాల్‌టికెట్ నంబర్, అవసరమైన వివరాలు నమోదు చేసి ఫలితాలను చెక్ చేసుకోవచ్చు. ఇంటర్ ప్రథమ సంవత్సరం సప్లిమెంటరీ ఫలితాల్లో 59 శాతం మంది, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 53 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మెరుగైన ఫలితాలు పొందిన విద్యార్థులకు మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు.

# వర్షాలు సమృద్ధిగా కురవాలని పూజలు

ఆదిలాబాద్,జూన్18 (ప్రజా వీక్షణం)

ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం రాంపూర్‌లో ఆదివాసులు అకాడి పండుగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామ సమీపంలోని శివారులో వన దేవతకు సాంప్రదాయ పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పశు వులకు కొత్తగా చిగురించిన మేతను తినిపించారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని , పంట దిగుబడి రావాలని, మూగజీవాలకు, పశు కాపర్లకు విష జంతువుల నుంచి ఎలాంటి హాని కలుగకుండా రక్షణ కల్పించాలని వన దేవతకు వేడుకున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ హెచ్ కె జంగు పటేల్, దేవారి రూప్ దేవ్, జగ్గేరావు, సీతారాం, దేవ్ రావు, పాండు, దాది రావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# తంత్రీ వాయిద్యకారుడు రమయ్యకు పురస్కారం

## - అభినందనలు తెలిపిన గ్రామస్థులు

పెద్దపల్లి,జూన్18 (ప్రజా వీక్షణం)

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామానికి చెందిన, కడ్డీ తంత్రి వాయిద్య కళాకారుడు దురిచేటి రామయ్య కు కేంద్ర ప్రభుత్వ పురస్కార్ అవార్డు దక్కింది. ఆయన ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. గ్రామస్తులు పులి వెంకటేశంతో పాటు పలువురు రామయ్య ఇంటికి వెళ్లి అవార్డుకు ఎంపిక కావడం పట్ల శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. అనంతరం శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. నిరుపేద కుటుంబానికి చెందిన రామయ్య కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

# రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు

## సునీల్ కుమార్ బెయిల్ పిటిషన్ విచారణ

## ఎప్పటిలోగా లొంగిపోతారో చెప్పాలన్న హైకోర్టు

## విచారణ నేటికి వాయిదా వేసిన కోర్టు

అమరావతి,జూన్ 18 (ప్రజా వీక్షణం)

ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ నాయక్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గురువారం విచారణ చేపట్టింది. ఈ విచారణ సందర్భంగా హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. పార్లమెంట్ సభ్యుడిపై కస్టోడియల్ టార్చర్ వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక ఐపీఎస్ అధికారికి ముందస్తు బెయిల్ రక్షణగా మారకూడదని స్పష్టం చేసింది. ఈ విచారణ సందర్భంగా న్యాయస్థానం పిటిషనర్‌ను ఉద్దేశించి 'ఎప్పటిలోగా సరెండర్ అవుతారని ప్రశ్నించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధిపై కస్టోడియల్ టార్చర్ ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని పేర్కొంది. పార్లమెంట్‌పై దాడి చేసిన వ్యక్తులకు, ఒక పార్లమెంట్ సభ్యుడిని కస్టడీలో వేధించిన వారికి మధ్య పెద్ద తేడా లేదని కోర్టు అభిప్రాయపడింది. ఇలాంటి సంఘటనల్లో పాల్గొనకుండా ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి తనను తాను నియంత్రించుకోవాల్సిన బాధ్యత ఉందని వ్యాఖ్యానించింది. ఎంపీని వేధింపులకు గురిచేయబోతున్నారని సునీల్ కుమార్ నాయక్‌కు ముందే తెలుసునని హైకోర్టు తెలిపింది. ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఆయన కీలక పాత్ర పోషించినట్లు ప్రాథమికంగా కనిపిస్తోందని పేర్కొంది. అందువల్ల ఆయన స్వచ్ఛందంగా వెళ్లి పోలీసుల ఎదుట సరెండర్ కావడం మంచిదని సూచించింది. ముందస్తు బెయిల్ కోరుతూ కొనసాగాలా, లేక సరెండర్ అయ్యే మార్గాన్ని ఎంచుకోవాలా అనే విషయంపై నిర్ణయం తీసుకుని కోర్టు ముందు హాజరు కావాలని ఆదేశించింది. సునీల్ కుమార్ నాయక్ తరఫు న్యాయవాది స్పందిస్తూ, పిటిషనర్‌తో సంప్రదించి తదుపరి నిర్ణయాన్ని హైకోర్టుకు తెలియజేస్తామని చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించి కోర్టు ముందు తమ వాదనలు వినిపిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తుది నిర్ణయం తీసుకోకుండా, కేసు విచారణను హైకోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. తదుపరి విచారణలో సునీల్ కుమార్ నాయక్ తరఫు నిర్ణయం, కోర్టు పరిశీలనలు కీలకంగా మారనున్నాయి.

# ప్రైవేట్ స్కూల్ ఫీజులను డిస్‌ప్లే చేయాలి

## - పబ్లిక్ డొమైన్‌లో తప్పనిసరి ప్రదర్శించాలి

## - అనాథ పిల్లలకు కూడా తల్లికి వందనం అమలు

## - విద్యాశ్శాఖ అధికారలుతో సమీక్షలో మంత్రి లోకేశ్

అమరావతి,జూన్18 (ప్రజా వీక్షణం)

ప్రైవేట్, అన్ ఎయిడెడ్ స్కూళ్ల అనుమతుల్లో అనవసర నిబంధనలు తొలగించాలని విద్యా,ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ సూచించారు. ప్రైవేట్ స్కూళ్ల ఫీజులను బోర్డులపై, పబ్లిక్ డొమైన్‌లో తప్పనిసరిగా ప్రదర్శించాలని స్పష్టం చేశారు. అనాథ పిల్లలకు కూడా 'తల్లికి వందనం' పథకం ప్రయోజనాలు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. గార్డియన్లు లేని పిల్లలకు జిల్లా కలెక్టర్ ద్వారా నిధుల పంపిణీపై దృష్టి సారించాలన్నారు. అనాథ పిల్లల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేసే విధానంపై ఆలోచన చేయాలన్నారు. ఇకపోతూ పీఎంశ్రీ నిధుల వినియోగంలో దేశంలోనే నంబర్-1గా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పీఎంశ్రీ పథకంలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన అధికారులకు అభినందనలు తెలియజేశారు. గురువారం విద్యాశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 844 స్మార్ట్ కిచెన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ వేగవంతం చేయాలన్నారు. మెగా పీటీఎం నాటికి విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీని పూర్తి చేయడమే లక్ష్యమన్నారు. 430 కేజీబీవీల్లో 1.06 లక్షల మంది బాలికలకు బంక్ బెడ్స్ ఏర్పాటు చేయాలన్నారు. 53,180 బంక్ బెడ్స్ ఏర్పాటుకు తక్షణ చర్యలు చేపట్టాలని లోకేశ్ ఆదేశించారు.ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీల్లో కూడా బంక్ బెడ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2.03 లక్షల మంది విద్యార్థులకు కిట్ల పంపిణీ చేయాలన్నారు. తెలుగు అకాడమీ పుస్తకాలు త్వరలో ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయని లోకేశ్ వెల్లడించారు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ ద్వారా తెలుగు అకాడమీ పుస్తకాల విక్రయాలకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, హాజరు పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కర్నూలు, అనంతపురం, మార్కాపురం, అల్లూరి, పోలవరం ప్రాంతాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల హాజరు 95 శాతానికి తగ్గకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని నాణ్యతతో, పారదర్శకంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. మ్యాథ్స్, సైన్స్, తెలుగులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. మాతృభాష తెలుగును విస్మరించొద్దని ఉపాధ్యాయులకు మంత్రి సూచనలు చేశారు. బ్రిడ్జ్ కోర్సు మెటీరియల్ సిద్ధం చేసి విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించాలని సూచించారు. హైస్కూల్ విద్యార్థులకు క్రోమ్ బుక్స్‌తో కంప్యూటర్ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్ ఆదేశాలు జారీ చేశారు.

# అనుమానాస్పద స్థితిలో దంపతుల మృతి

## - కుమారుడి ఫిర్యాదుతో పోలీసుల దర్యాప్తు

కుమ్రంభీం ఆసిఫాబాద్,జూన్18 (ప్రజా వీక్షణం)

కుమ్రం భీం జిల్లా ఆసిఫాబాద్ మండలంలో అనుమానాస్పద స్థితిలో దంపతులు మృతి చెందడం కలకలం సృష్టిస్తోంది. తుంపల్లి గ్రామపంచాయతీ కోసార గ్రామ పరిధిలోని భవానీ నగర్‌లో దారుణం చోటు చేసుకుంది. బానోత్ రాజు ,సునీత దంపతులు బుధవారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందారు. ఇద్దరు దంపతులు కొడుకు, కోడలుతో కలిసి భవానీ నగర్‌లో జీవనం కొనసాగిస్తున్నారు. రాత్రి భోజనం చేసిన అనంతరం భార్యాభర్తలు ఇద్దరు ఇంటి బయట వరండాలో పడుకున్నారు. రాత్రి 3 గంటల ప్రాంతంలో కరెంట్ పోవడంతో కోడలు తమ చిన్న పాపను అత్త సునీత దగ్గర పడుకోబెట్టేందుకు వచ్చి నిద్ర నుంచి లేపే ప్రయత్నం చేయగా ఆమె నుంచి స్పందన రాకపోవడంతో చూడగా అప్పటికే ఇద్దరు మృతి చెందారు. గతంలో పీరీల విషయంలో గొడవలు జరిగాయని, తమ తల్లిదండ్రులను హత్య చేసి ఉంటారని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆసిఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# శాస్త్రినగర్ 2కోట్ల కేసు ఛేదన

## - నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు

చెన్నై,జూన్18 (ప్రజా వీక్షణం)

నగరంలో శాస్త్రి నగర్ ప్రాంతంలో చోరీకి గురైన రూ.2 కోట్ల కేసును తమిళనాడు పోలీసులు ఛేదించారు. అందుకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 1.97 కోట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే , మూడు మొబైల్ ఫోన్లతోపాటు కారును స్వాధీనం చేసుకుని.. సీజ్ చేశారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని నగర పోలీసులు వెల్లడించారు. ఇటీవల చెన్నైలోని శాస్త్రినగర్‌లో ఓ ప్రైవేట్ ్ర÷నాన్స్ సంస్థ నుంచి ఈ ముగ్గురు నిందితులు రూ. 2 కోట్లు చోరీ చేశారు. దాంతో్ ÷నాన్స్ కంపెనీ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా్ ÷నాన్స్ సంస్థతోపాటు పరిసర ప్రాంతాల్లోని సీసీ టీవీ కెమెరాలను పోలీసులు జల్లెడ పట్టారు. అనంతరం ఈ చోరీకి పాల్పడిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.

# వన మహోత్సవ్2026

## - వరంగల్‌లో రూ.1.84 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 18 (ప్రజా వీక్షణం న్యూస్)

రాష్ట్ర స్థాయి వన మహోత్స వ్2026 సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్ గా వరంగల్ జిల్లా లో రూ.1.84 కోట్ల విలువైన అటవీ, ఎకో-టూరిజం అభివృద్ధి పనులను ప్రారంభించారు. నర్సంపేట పరిధిలోని పాఖాల్ బయో డైవర్సిటీ పార్కో సఫారీ వాహనాలు, పెడల్ బోటింగ్ పూల్, పర్యావరణ విద్యా కేంద్రం, డార్మిటరీ, నైట్ క్యాంపింగ్, ఆర్వో ప్లాంట్, సీసీ రోడ్లు వంటి సౌకర్యాల ను అందుబాటులోకి తీసుకొచ్చారు. కార్యక్రమం లో ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ సత్య శారద తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి, జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు.





# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు పనిచేయాలి

## - ఎంపీ కడియం కావ్య

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ జూన్ 18 (ప్రజా వీక్షణం న్యూస్)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధి కారులు సమన్వయంతో పని చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సూచించారు. జిల్లా దిశా సమావేశంలో వ్యవసాయం, విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు యూరియా, ఎరువులు, విత్తనాల లభ్యత పై పర్యవేక్షణ పెంచాలని, ఖరీఫ్‌రబీ సీజన్లకు ముందే విస్తృత అవగాహన కార్య క్రమాలు నిర్వహించాలని సూచించారు. సేంద్రీయ వ్యవసాయం, ఇంటర్ క్రాపింగ్‌ను ప్రోత్సహించాల ని, అభివృద్ధి పనుల్లో జాప్యా న్ని తగ్గించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్స్ తగ్గించి ఎన్‌రోల్ మెంట్ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.



# మాదక ద్రవ్యాల నిర్మూలనకు చర్యలు

## నేడు ఎల్‌బి స్టేడియంలో విద్యార్థులతో ప్రమాణం

## పాల్గొననున్న సిఎంరేవంత్, గవర్నర్ శుక్లా

హైదరాబాద్,జూన్ 18 (ప్రజా వీక్షణం)

తెలంగాణ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్యా వాతావరణం , మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టుబడి ఉందని మరోసారి చాటిచెబుతూ, జూన్ 19న శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్.బి. స్టేడియంలో రాష్ట్ర స్థాయి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనుంది. కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి గారు రెసిడెన్షియల్ విద్యాసంస్థల విద్యార్థులకు 'విద్యార్థి హక్కుల కిట్లు' పంపిణీ చేయనున్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమం, వసతి సదుపాయాల కల్పనలో భాగంగా 20రకాల వస్తువులతో కిట్లు అందజేస్తున్నారు. కార్యక్రమంలో పాఠశాలలు, కళాశాలలను మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా విద్యార్థులతో కలిసి 'మాదకద్రవ్య రహిత పాఠశాలలు / కళాశాలలు' లక్ష్యంతో సామూహిక ప్రతిజ్ఞ చేయిస్తారు. ఈ ప్రతిజ్ఞ ద్వారా విద్యార్థుల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన పెంపొందించడం, నివారణ చర్యలను బలోపేతం చేయడం, విద్యాసంస్థల్లో సురక్షితమైన, ఆరోగ్యకరమైన, బాధ్యతాయుతమైన అభ్యాస వాతావరణాన్ని ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశ్యం. కార్యక్రమం లో దాదాపు 15వేల మంది విద్యార్థులు పాల్గొంటారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వివిధ సంక్షేమ శాఖలు, విద్యా శాఖ సంబంధిత అధికారులకు కార్యక్రమ నిర్వహణకు అవసరమైన బాధ్యతలు కేటాయించబడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల సంక్షేమం, మాదకద్రవ్యాల నిర్మూలన, విద్యా రంగ బలోపేతానికి ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవనుంది.

# ఆర్యాపురం బ్యాంక్ అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

తాడేపల్లిగూడెం ప్రతినిది జూన్ 18 (ప్రజా వీక్షణం)

ఆర్యాపురం బ్యాంకు అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు సూచించారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటుచేసిన ది ఆర్యాపురం కో ఆపరేటివ్ ఆర్యన్ బ్యాంక్ ను రాజమండ్రి పట్టణ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు గురువారం ప్రారంభించగా, వివిధ విభాగాలను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, తెదేపా నియోజవర్గ ఇంచార్జ్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి)తో పాటు పట్టణానికి చెందిన చెందిన పలువురు ప్రముఖులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యాపురం బ్యాంక్ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ బ్యాంకు గృహరుణాలు, వ్యాపార రుణాలు అందిస్తున్నాయని వాటిని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్యాపురం బ్యాంకు తన శాఖలను విస్తరిస్తూ తాడేపల్లిగూడెం పట్టణంలో నూతన శాఖను ప్రారంభించిందని తెలిపారు. ఈ బ్యాంకు టర్నోవర్ ఏడాదికి రూ కోట్లలో ఉందని వివరించారు. అతిథులను బ్యాంకు ప్రతినిధులు పుష్పగుచ్ఛం, సాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపార వేత్త నంద్యాల కృష్ణమూర్తి,టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి గొర్రెల శ్రీధర్, జనసేన సీనియర్ నాయకులు పైబోయిన వెంకటరామయ్య, పద్మనాభుని మురళి, దాట్ల జగన్నాథరాజు తదితరులు పాల్గొన్నారు.



# జంగారెడ్డిగూడెంలో భారీ భూ కుంభకోణం భేదనం

# ఏడుగురు నిందితుల అరెస్ట్!

జంగారెడ్డిగూడెం:జూన్ 18(ప్రజా వీక్షణం)

బతికుండగానే ఒక మహిళ చనిపోయినట్లు నకిలీ మరణ ధృవీకరణ పత్రం సృష్టించి, కోట్లాది రూపాయల విలువైన భూమిని కబ్జా చేసిన ముఠా గుట్టును ఏలూరు జిల్లా జంగారెడ్డి గూడెం పట్టణ పోలీసులు రట్టు చేశారు. ఈ భారీ భూ కుంభకోణానికి సంబంధించి ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు జంగారెడ్డిగూడెం ఏఎస్పీ సుస్మిత రామనాథన్ (సుస్మిత ఆర్) మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. నిందితులు అత్యంత పక్కా స్కెచ్‌తో ఈ మోసానికి పాల్పడ్డారు. బాధితురాలైన మహిళ బతికే ఉన్నప్పటికీ, ఆమె మరణించినట్లు నకిలీ మరణ ధృవీకరణ పత్రాన్ని సృష్టించారు. అంతటితో ఆగకుండా, సదరు మహిళ పేరిట ఒక నకిలీ వీలునామాను, మరికొన్ని ఫోర్జరీ పత్రాలను తయారు చేశారు. వీటి ఆధారంగా జంగారెడ్డిగూడెంలోని 625 చదరపు గజాల విలువైన స్థలాన్ని తమ పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆక్రమించుకున్న స్థలాన్ని ప్లాట్లుగా మార్చి, రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరిట అమాయక కొనుగోలు దారులను నమ్మించారు. ఆ స్థలంపై ఎలాంటి వివాదాలు లేవని నమ్మబలికి, ప్లాట్లను విక్రయించి వారి వద్ద నుండి ఏకంగా రూ. 55 లక్షలు వసూలు చేసి కాజేశారు.తన భూమి పరాయిపాలైందని, ఎవరో నకిలీ పత్రాలతో కబ్జా చేశారని బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో ఈ దారుణం వెలుగుచూసింది. బాధితురాలి ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన జంగారెడ్డిగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలించి, ఈ కుంభకోణంలో కీలక సూత్రధారులైన ఉండి కృష్ణవేణి, మత్స్య లోవరాజు సహా ఏడుగురు కబ్జా కోరులను అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుండి ఫోర్జరీకి ఉపయోగించిన నకిలీ పత్రాలు, ఒక ల్యాప్‌టాప్, మరియు ఒక ప్రింటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఏఎస్పీ సుస్మిత రామనాథన్ మాట్లాడుతూ.. ప్రజలు ఆస్తులు, స్థలాలు కొనుగోలు చేసేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.కేవలం బ్రోకర్లు, విక్రయదారులు ఇచ్చే పత్రాలను మాత్రమే నమ్మకూడదని పేర్కొన్నారు.స్థలం కొనే ముందు తప్పనిసరిగా ఈసీ మరియు రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని ఆమె ప్రజలను హెచ్చరించారు. కబ్జాలు, మోసాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.




# రామగుండం ఎరువులు మనకే కేటాయించాలి

## కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఢిల్లీ వెళతాం

## ఒక్క మొక్కజొన్న గింజకూడా కొనని కేంద్రం

## రైతుబీమా పథకం కింద ఎల్‌ఐసికి బీమా మొత్తం చెల్లింపు

## మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి

హైదరాబాద్,జూన్ 18 (ప్రజా వీక్షణం)

రామగుండం ఎరువులు పొందేలా కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమిస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. ప్రతి నెల రెండు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇస్తామని అన్నారని.. కానీ హామీ ఇచ్చిన మేరకు కేంద్రం యూరియా సరఫరా ఎందుకు చేయట్లేదని ప్రశ్నించారు. గురువారం సచివాలయంలో మీడియాతో మంత్రి తుమ్మల మాట్లాడారు. ఢిల్లీకి వెళ్లి సరిపడా యూరియా తెలంగాణకు ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతామని పేర్కొన్నారు. కేంద్రం ఎంఎస్పీ ప్రకటించి కొనుగోలు నుంచి తప్పుకుంటుందని మంత్రి తుమ్మల విమర్శించారు. ఒక్క గింజ మొక్కజొన్నని కూడా కేందప్రభుత్వం ఎందుకు కొనలేదని నిలదీశారు. ఈ విషయాన్ని తెలంగాణ రైతాంగంపై కక్ష అనుకోవాలా అన్నారు. కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు మంత్రుల బృందం ఢిల్లీకి వెళ్తామని స్పష్టం చేశారు. తొలకరి వర్షానికే విత్తనాలు వేస్తే రైతులు నష్టపోతారని చెప్పారు. రెండుసార్లు వర్షం పడితేనే సరిపడా తడి వస్తుందని.. అన్నదాతలు ఈ విషయాన్ని గమనించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇకపోతే రైతు మరణించిన సందర్భంలో వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే రైతు బీమా పథకాన్ని ప్రభుత్వం అత్యంత బాధ్యతతో అమలు చేస్తోందన్నారు. ఎల్‌ఐసీకి చెల్లించాల్సిన మొత్తం వార్షిక ప్రీమియాన్ని ప్రభుత్వం ఇప్పటికే చెల్లించిందన్నారు. ల్గ÷తు బీమా పథకాన్ని నిలిపివేసినట్లు బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారం పూర్తిగా అసత్యమని మంత్రి తుమ్మల అన్నారు. రైతు సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకు ఉపయోగపడే ఏ ఒక్క పథకాన్ని నిలిపివేసిన దాఖలాలు లేవని, పథకాలను నిలిపివేసి రైతులను ఇబ్బందులకు గురిచేసిన చరిత్ర గత ప్రభుత్వానిదే అని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే వ్యవసాయ యాంత్రీకరణ, సాయిల్ హెల్త్ టెస్ట్, సబ్సిడీపై విత్తనాలు వంటి పథకాలను నిలిపివేయడమే కాకుండా స్టేట్ వాటాను విడుదల చేయకుండా కేంద్ర ప్రాయోజిత పథకాలను సైతం రైతులకు దూరం చేసిందని విమర్శించారు. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎలాంటి బేషజాలకు పోకుండా అమలు చేయడమే కాకుండా.. గత ప్రభుత్వం ఆపేసిన పథకాలను పునరుద్ధరిస్తూ రైతులకు అండగా నిలుస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు. మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 66,038 మంది రైతుల కుటుంబాలు రైతు బీమా పథకం ద్వారా లబ్ది పొందాయని మంత్రి తెలిపారు. ఆయా కుటుంబాల నామినీల ఖాతాల్లో మొత్తం రూ. 3301.90 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. 2023 డిసెంబర్ నుంచి ఆ ఏడాది ముగిసే వరకు 20,090 కుటుంబాలకు రూ.1,004.50 కోట్లు, 2024 సంవత్సరంలో 25,861 కుటుంబాలకు రూ.1,293.05 కోట్లు బీమా సాయంగా అందించినట్లు వివరించారు. 2025-26 సంవత్సరానికి రాష్ట్రంలో 42.16 లక్షల మంది రైతులు రైతు బీమా పథకంలో నమోదు చేసుకున్నారని, వీరందరికీ వర్తించేలా ఎల్‌ఐసీకి చెల్లించాల్సిన మొత్తం వార్షిక ప్రీమియం రూ.1,359.56 కోట్లను ప్రభుత్వం పూర్తిగా చెల్లించిందన్నారు. దీంతో 20,087 కుటుంబాలకు రూ.1004.35 కోట్లు బీమా సహాయంగా అంది, మరణించిన రైతు కుంటుబాలకు ఆర్థిక చేయూత అందించడం జరిగిందని అన్నారు. రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నాలు మానుకోవాలని మంత్రి హితవు పలికారు. రైతు మరణంతో దుఃఖంలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి వారిని ఆర్థికంగా నిలదొక్క కొనే విధంగా రైతు బీమా పథకాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

# పవన్ కళ్యాణ్‌పై ఎందుకు కేసు పెట్టలేదు

## - కెటిఆర్ సిరిసిల్లకు విజిటింగ్ టూరిస్ట్

## - టిఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విమర్శలు

కరీంనగర్,జూన్ 18 (ప్రజా వీక్షణం)

ప్రాంతీయవాదాన్ని వేర్పాటువాదంతో పోల్చిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కేసు పెట్టలేదని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు





కవిత ప్రశ్నించారు. కేసు పెట్టడం చేతగాని ప్రభుత్వం తెలంగాణలో ఉందని విమర్శించారు. కరీంనగర్‌లో తెలంగాణ రక్షణ సేన జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఈ విషయాన్ని ప్రాధాన్యత లేని అంశంగా భావిస్తోందన్నారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక పలువురు నేతలు తెలంగాణ భావజాలంపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యమానికి అండగా నిలిచిన కరీంనగర్‌లో తెలంగాణ తల్లి విగ్రహం లేకపోవడం ప్రజల త్యాగాలను అవమాన పరిచినట్లేనని కవిత అన్నారు. ఇకపోతే మాజీమంత్రి కేటీఆర్‌పై కల్వకుంట్ల కవిత షాకింగ్ కామెంట్స్ చేశారు. కేటీఆర్ సిరిసిల్లాకు వీకెండ్‌లో వచ్చి వెళ్లిపోతారని ఎద్దేవా చేశారు. సిరిసిల్లలో కవిత పర్యటించి. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ రైతన్నల నడ్డి విరిస్తే కేటీఆర్ ఎందుకు మాట్లాడట్లేదని ప్రశ్నించారు. సిరిసిల్లలో సెస్ ఆగమాగం అయితే కేటీఆర్ ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. రైతు డిస్కంలపై ఇప్పటి వరకు కేటీఆర్ ఎందుకు నోరెత్తలేదని కవిత ప్రశ్నల వర్షం కురిపించారు. రైతు డిస్కం కావాలో, వద్దో ఆయన ఎందుకు చెప్పలేదని నిలదీశారు. నేరెళ్లలో అక్రమ ఇసుక సంపాదన కోసం దళితులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ధ్వజమెత్తారు. నేరెళ్ల బాధితులకు ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం జరగలేదని చెప్పుకొచ్చారు. నేరెళ్ల ఇసుక బాధితుల తరపున కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కార్పొరేటర్‌గా వచ్చి.. నేరెళ్ల బాధితుల ఓట్లతో బండి సంజయ్ కేంద్రమంత్రి అయ్యారని కవిత పేర్కొన్నారు.

# హర్మూజ్ తెరుచుకున్నా ఇంధన ధరలు తగ్గవు

### - ఇప్పట్లో తగ్గించే ఉద్దేశ్యం లేదన్న కేంద్రం

న్యూఢిల్లీ,జూన్18 (ప్రజా వీక్షణం)

అమెరికా- ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందంతో పశ్చిమాసియా సంక్షోభానికి తెరపడింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు దిగిరానున్నాయి. అయితే, ముడి చమురు ధరలు తగ్గినా.. భారత్‌లో వెంటనే ఇంధన ధరలను మాత్రం తగ్గించలేమని కేంద్రం తాజాగా స్పష్టం చేసింది. పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ ఇటీవల ఇంధన ధరలు పెంచడంపై గురువారం మాట్లాడారు. లీటరుకు దాదాపు రూ.3.94 మాత్రమే పెంచామన్నారు. అయితే, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినంత మాత్రాన.. ఆ పెంపును వెంటనే తగ్గించలేమన్నారు. హర్మూజ్ జలసంధి తెరుచుకున్నప్పటికీ.. ప్రస్తుతం అక్కడ నౌకల రాకపోకల రద్దీ ఎక్కువగా ఉంటుందన్నారు. దీంతో తక్కువ ధరకు లభించే ముడి చమురు భారత్‌కు వచ్చేందుకు ఇంకా సమయం పడుతుందని తెలిపారు. ఇలా పలు అంశాల వల్ల ఇంధన ధరలను వెంటనే తగ్గించలేమని స్పష్టంచేశారు. ఇక, పశ్చిమాసియా యుద్ధం మొదలైనప్పటి నుంచి దేశంలోని చమురు కంపెనీలు తీవ్రంగా ప్రభావితమయ్యాయన్నారు. ఆ సమయంలో ఇంధన ధరలపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించేందుకు ఏ రాష్ట్రం ముందుకు రాలేదన్నారు. దీంతో ఆ భారమంతా కేంద్రంపై పడిందన్నారు.

# టీజీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో 'మహిళా శక్తి క్యాంటీన్

### - పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్,జూన్ 18 (ప్రజా వీక్షణం)

మింట్ కాంపౌండ్‌లోని టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయ ఆవరణలో ఉద్యోగుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన 'మహిళా శక్తి క్యాంటీన్'ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం సందర్శించి, పరిశీలించారు. క్యాంటీన్ ఏర్పాటుకు అయిన మొత్తం ఖర్చు, అక్కడ ఉద్యోగులకు కల్పించిన వివిధ రకాల వసతులు, మౌలిక సౌకర్యాల గురించి ఆ సంస్థ సీఎండీ జితేష్ వి పాటిల్‌ను డిప్యూటీ సీఎం అడిగి తెలుసుకున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్వావలంబన, ఉద్యోగులకు పరిశుభ్రమైన ఆహారం అందించడమే లక్ష్యంగా ఈ క్యాంటీన్లను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. క్యాంటీన్ నిర్వాహకులతో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి.. ఉద్యోగులకు, సందర్శకులకు ఎల్లప్పుడూ సరసమైన ధరలకే నాణ్యమైన, రుచికరమైన ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. అనంతరం క్యాంటీన్‌లో ఏర్పాటు చేసిన మెనూ బోర్డును, ధరల పట్టికను ఆయన నిశితంగా పరిశీలించారు. కార్యక్రమంలో సింగరేణి సిఎండి జ్యోతి బుద్ధ ప్రకాష్ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు డైరెక్టర్ కమర్షియల్ చక్రపాణి, గారు డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ఐటి శివాజీ , డైరెక్టర్ ఆపరేషన్స్ ఔ.నరసింహ , డైరెక్టర్ ఫైనాన్సు కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# రిజిస్ట్రేషన్ సర్వర్ నిర్వహణ పనులు

### 26 నుంచి 28 వరకు రిజిస్ట్రేషన్ సేవలకు విరామం

### జూన్ 29 నుంచి యథావిధిగా సేవలు

హైదరాబాద్,జూన్ 18 (ప్రజా వీక్షణం)

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన వెబ్‌సైట్‌తో పాటు అనుబంధ ఆన్‌లైన్ సేవలు షెడ్యూల్ చేసిన సర్వర్ నిర్వహణ పనుల కారణంగా ఈ నెల 26 నుంచి 28 వరకు తాత్కాలికంగా అందుబాటులో ఉండవని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ÷ఎమారు ఐదేళ్ల తర్వాత చేపడుతున్న ఈ సర్వర్ నిర్వహణ పనుల ద్వారా సర్వర్ వ్యవస్థలు మరింత సజావుగా పనిచేయడం, భద్రతా ప్రమాణాలు బలోపేతం కావడం, సేవల నాణ్యత మెరుగుపడడం కోసం ఈ తాత్కాలిక విరామం అవసరమని ఆయన పేర్కొన్నారు. అయితే జూన్ 26న మొహరమ్, జూన్ 28న ఆదివారం ప్రభుత్వ సెలవు దినాలు కావడంతో, మధ్యలో ఉన్న జూన్ 27న ఒక్కరోజు మాత్రమే ప్రభుత్వ పని దినంలో రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం కలుగుతుందని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. దీంతో సాధారణ ప్రజలకు కలిగే అసౌకర్యం అత్యల్పంగా ఉండేలా ఈ షెడ్యూల్ రూపొందించామని తెలిపారు. ప్రజలు తమ రిజిస్ట్రేషన్ సంబంధిత పనులను ముందస్తుగా ప్రణాళిక చేసుకోవాలని, జూన్ 29వ తేదీ నుంచి అన్ని సేవలు యథావిధిగా పునఃప్రారంభమవుతాయని ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడించారు. శాఖ నిర్వహణ పనులకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

# 20న అన్నదాత సుఖీభవ నిధులు విడుదు

### - కేంద్ర సాయంతో కలిపి రూ.12వేలు జమ

### - లింగంగుంట్లలో సీఎం చంద్రబాబు ప్రారంభం

### - వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి





అమరావతి,జూన్18 (ప్రజా వీక్షణం)

అన్నదాత సుఖీభవ మొదటి దశ నిధులను ఈనెల 20వ తేదీన విడుదల చేస్తామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. 45.5 లక్షల మంది రైతులకు కేంద్ర సాయంతో కలిపి రూ.12వేలు జమ చేస్తామని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గం లింగంగుంట్లలో సీఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవను లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. పొగాకు రైతుల సమస్యలపై మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవి, డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ఉగ్ర నరసింహారెడ్డిలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. ఆక్వా, పొగాకు, మామిడి రైతులు నష్టపోకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారని వ్యాఖ్యానించారు. పొగాకు ధర రూ.200 తగ్గకుండా కొనుగోళ్లు జరగాలని సీఎం ఆదేశించారని పేర్కొన్నారు. తోతాపురి మామిడికి కేజీకి రూ.4 ప్రభుత్వం చెల్లించాలని నిర్ణయించారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. 28కంపెనీలు పొగాకు బోర్డు వేలంలో పాల్గొనాలని సీఎం ఆదేశించారని అన్నారు. ఇకపై ఆక్వా ఫీడ్ ధరలు పెరగాలంటే కమిటీ ద్వారానే నిర్ణయం జరుగుతుందని స్పష్టం చేశారు. రైతులు, ఫీడ్ ఉత్పత్తిదారులు, ప్రభుత్వ భాగస్వామ్యంతో ఏర్పడే కమిటీ ధరలు సమీక్షించి నిర్ణయిస్తుందని వివరించారు. పొగాకు రైతులు గత ఏడాది కంటే ఎక్కువ వర్జీనియా రకం సాగు చేయటంతో ధరలపై ప్రభావం చూపిందని అన్నారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో కూడా పొగాకు ధరలు పడిపోయాయని చెప్పుకొచ్చారు. సీఎం చొరవతో 28రకాల పొగాకు కంపెనీలతో చర్చించామని తెలిపారు. పొగాకు బోర్డు వేలంలో కాకుండా దొంగచాటుగా కొనుగోళ్లు జరిపితే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఢిల్లీ కూడా వెళ్లి పొగాకు రైతులు నష్టపోకుండా కేంద్రపెద్దలను కూడా కలుస్తామని వెల్లడించారు. తోతాపురి మామిడి రైతులకు గత ఏడాదిలానే టన్నుకు రూ.4వేలు చెల్లిస్తామని అన్నారు. ఆక్వా రైతులపై ఉద్యమ కార్యాచరణ అనటానికి వైసీపీ నేతలకి సిగ్గుండాలని ఎద్దేవా చేశారు. సాయికృష్ణ ఘటనను రాజకీయం చేయటం గొడ్డలి పార్టీకే చెల్లిందని మండిపడ్డారు. గొడ్డలి పార్టీ మళ్లీ అధికారంలోకి రాదని జగన్ కుల, మతాల మధ్య తగాదాలు పెట్టాలని చూస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పొగాకు బోర్డు వేలంలో అన్ని కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. పొగాకు ధరలు తగ్గకుండా జాగ్రత్తలు తీసుకుంటామని అన్నారు. అధిక ఉత్పత్తిని సాకు చూపి ధరలు తగ్గించే చర్యలు చేపట్టడం తగదని అన్నారు. వచ్చే ఏడాది ఎంతమేర పంట వేయాలనేది ముందుగానే చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వ్యాపారస్తులు ఎట్టిపరిస్థితుల్లోనూ రైతుల వద్ద ఉన్న పొగాకుని కొనుగోలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. రైతులు నష్టపోయే చర్యలను చేపడితే ఉపేక్షించబోమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ హెచ్చరించారు.

# మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### - ఉర్దూ అకాడమీ గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా ముషాయిరా

### - వేగంగా రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణం

### - కొత్త స్మశాన వాటికల స్థల సేకరణపై కలెక్టర్లకు ఉత్తర్వులు

### - డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

### - సమావేశానికి హాజరైన మంత్రి హజారుద్దీన్ కార్పొరేషన్ చైర్మన్లు





హైదరాబాద్,జూన్ 18 (ప్రజా వీక్షణం)

రాష్ట్రంలోని మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందుకోసం బడ్జెట్‌లో భారీగా నిధులను కేటాయించామని, వాటికి సంబంధించిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మైనార్టీల సంక్షేమం, వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శనివారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు. ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవాల సందర్భంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో ఉర్దూ సంస్కృతిని ప్రతిబింబించేలా పెద్ద ఎత్తున 'ముషాయిరా' (కవి సమ్మేళనాలు) నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఈ కార్యక్రమం నిర్వాహణకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను అన్ని రకాల ఆధునిక హంగులు, వసతులతో నిర్మిస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20 రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని, మరో 17 పాఠశాలలు నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు ఈ సందర్భంగా వివరించారు. దీనిపై భట్టి విక్రమార్క స్పందిస్తూ... అసంపూర్తిగా మిగిలిపోయిన మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల భవనాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పనులు ఎక్కడా ఆగకుండా ఒక నిర్ణీత టైమ్ క్యాలెండర్‌ను రూపొందించుకుని, దాని ప్రకారమే పనులు పూర్తయ్యేలా పర్యవేక్షణ చేయాలని, మిగిలిన 17 పాఠశాల భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మైనార్టీ యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు మరియు వారిని ఆర్థికంగా నిలబెట్టడానికి రాజీవ్ యువ వికాసం' పథకం ద్వారా పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలు చేయడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. క్రిస్టియన్



మైనార్టీల సంక్షేమం కొరకు ప్రత్యేకంగా రూ. 50 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నిధులను క్రిస్టియన్ మైనార్టీ యువత స్వయం ఉపాధి రంగంలో రాణించడానికి తగిన ఆర్థిక ప్రోత్సాహం అందించడానికి కేటాయిస్తామన్నారు. మైనార్టీ సంస్థలకు సంబంధించిన విలువైన వక్ఫ్ మరియు ఇతర భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు తగిన చట్టపరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, మైనార్టీల స్మశాన వాటికల చుట్టూ ప్రహరీ గోడల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకోసం తక్షణమే ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న జిల్లా, డివిజన్ కేంద్రాల్లో స్మశాన వాటికల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను సేకరించి కేటాయించాల్సిందిగా జిల్లా కలెక్టర్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేయనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. హైదరాబాద్ నగరంలో జరగబోయే మొహర్రం వేడుకల సందర్భంగా, 9వ రోజున నిర్వహించే ప్రత్యేక కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్ కోరగా.. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించి, తప్పకుండా హాజరవుతానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ గౌరవ ఉప్పల్, ఫైనాన్స్ సెక్రటరీ సిక్తా పట్నాయక్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా, మైనార్టీ ÷నాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్ ఉన్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక






## అనిల్ రావిపూడి మరో మల్టీస్టారర్ ప్రాజెక్ట్ వెంకటేశ్, కళ్యాణ్ రామ్ మూవీకి శ్రీకారం

టాలీవుడ్‌లో మరో భారీ మల్టీస్టారర్ చిత్రానికి తెరలేచింది. సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ హీరోలుగా తెరకెక్కబోతున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకకు దిగ్గజ దర్శకుడు రాఘవేంద్రరావుతో పాటు ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తదితరులు విచ్చేసి క్లాప్ కొట్టారు. ఇక ఈ సినిమాలో నటించబోయే కథానాయికలకు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా వచ్చేసింది. ఈ హిలేరియస్ ఎంటర్‌టైనర్‌లో వెంకీ మామకు జోడీగా నేషనల్ అవార్డ్ విన్నర్ కీర్తి సురేష్ నటిస్తోండగా.. నందమూరి హీరో కళ్యాణ్ రామ్ సరసన టాలెంటెడ్ బ్యూటీ కృతి శెట్టి సందడి చేయనుంది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు నేషనల్ అవార్డ్ గ్రహీత జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా.. సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్ మరియు జీ స్టూడియోస్ సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యం వహిస్తున్నాయి. అనిల్ రావిపూడికి బాగా కలిసివచ్చిన సంక్రాంతి సీజన్‌నే ఈ సినిమాకు కూడా లాక్ చేశారు. 2027 సంక్రాంతి కానుకగా ఈ అవుట్ అండ్ అవుట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. దగ్గుబాటి మరియు నందమూరి వంశాల హీరోలు కలిసి నటిస్తుండటంతో, అనిల్ రావిపూడి మార్క్ కామెడీ అండ్ యాక్షన్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై అటు అభిమానుల్లో, ఇటు సాధారణ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.




# ఇండియా స్టోరీ పోస్టర్ విడుదల

బాలీవుడ్ నటులు కాజల్ అగర్వాల్, శ్రేయాస్ తల్పడే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పాన్ ఇండియా సోషియో నేషనల్ డ్రామా 'ది ఇండియా స్టోరీ' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. జీ స్టూడియోస్ సమర్పణలో ఎంఐజీ ప్రొడక్షన్స్ / స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి చెత్తన్ డీకే దర్శకత్వం వహిస్తుండగా, సాగర్ బి. షిండే కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సుమిత్ బగడే, అనితా జాదవ్, వినాయక్ సైదానీ, కల్పేష్ షా, దేవయాని ఖోరటే, ప్రేమ్ జోషి ఈ చిత్రానికి సహ నిర్మాతలుగా ఉన్నారు. దేశంలో తీవ్రమవుతున్న ఆహార కల్తీ, వ్యవసాయంలో రసాయనాలు, పురుగుమందుల మితిమీరిన వాడకం వెనుక ఉన్న కుంభకోణాల చుట్టూ ఈ చిత్ర కథ సాగనుంది. బాంబే హైకోర్టు నేపథ్యంలో గ్రిప్పింగ్ కోర్టు రూమ్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ పవర్‌ఫుల్ లాయర్ పాత్రలో, శ్రేయాస్ తల్పడే ఆందోళనలో ఉన్న తండ్రి పాత్రలో కనిపించనున్నారు. జీ స్టూడియోస్ ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్న 'ది ఇండియా స్టోరీ' 2026 జూలై 24న హిందీ, తమిళం, తెలుగు భాషల్లో గ్రాండ్‌గా థియేటర్లలోకి రానుంది.

## కోలీవుడ్‌లో దీపావళి ఫైట్
## రజనీకాంత్ జైలర్-2తో ధనుష్ మూవీ పోటీ

కోలీవుడ్‌లో ఈ ఏడాది దీపావళి పండుగకు బాక్సాఫీస్ దగ్గర మరోసారి భారీ వార్‌కు రంగం సిద్ధమవుతోంది. సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ 'జైలర్ 2' షూటింగ్ శరవేగంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ ఇప్పటికే 90 శాతం షూటింగ్ పూర్తి చేసుకుని చివరి దశకు చేరుకుంది. ఇక ఈ సినిమాకు సంబంధించిన డిజిటల్, శాటిలైట్ రైట్స్ కోసం దిగ్గజ ఓటీటీ సంస్థల మధ్య పోటీ నెలకొంది. ఈ సీక్వెల్‌లో బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ ఒక పవర్‌ఫుల్ క్యామియో రోల్‌లో సందడి చేయనున్నాడు. వచ్చే వారం నుంచి హృతిక్ పార్ట్ షూటింగ్‌ను ప్లాన్ చేశారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే 'జైలర్ 2'ను దీపావళి కానుకగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. అధికారిక ప్రకటన త్వరలోనే రానుంది. ఇదిలా ఉంటే నటుడు ధనుష్ కూడా అదే దీపావళి రేసులోకి దిగేందుకు సిద్ధమవుతున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ధనుష్ కెరీర్‌లో 55వ చిత్రంగా 'అమరన్' ఫేమ్ రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాలో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి కీలక పాత్ర పోషిస్తుండగా, స్టార్ హీరోయిన్లు సాయి పల్లవి, శ్రీలీల కథానాయికలుగా నటిస్తున్నారు. పాన్ ఇండియా లెవెల్లో భారీ తారాగణంతో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కూడా దీపావళికే రిలీజ్ చేసే యోచనలో నిర్మాతలు ఉన్నారు. ప్రస్తుతం రెండు టీమ్స్ పోస్ట్ ప్రొడక్షన్ పనులు, చివరి షెడ్యూల్ షూటింగ్స్‌తో బిజీగా ఉన్నాయి. ఒకవైపు రజనీకాంత్ క్రేజ్, మరోవైపు ధనుష్ కంటెంట్.. దీంతో ఈ దీపావళికి కోలీవుడ్ బాక్సాఫీస్ వద్ద గట్టి పోటీ ఖాయమని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. మరి ఈ క్లాష్‌లో ఎవరు పైచేయి సాధిస్తారో చూడాలి.






## థియేటర్లలో పెద్ది..రీలోడెడ్ వర్షన్
## మరో ఆరు నిముషాల అదనపు దృశ్యాలు జోడింపు

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న 'పెద్ది' సినిమాకు సంబంధించి మేకర్స్ క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ఇప్పుడు సరికొత్త 'రీలోడెడ్ వెర్షన్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దాదాపు 5 నిమిషాల 56 సెకన్ల నిడివి గల అదనపు దృశ్యాలను జోడించి నేటి నుంచి థియేటర్లలో ప్రదర్శించనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ కొత్త ఫుటేజ్‌లో కథానాయిక జాన్వీ కపూర్‌కు సంబంధించిన ఎమోషనల్ సీన్స్‌తో పాటు, సీనియర్ నటుడు జగపతి బాబు నటించిన కీలకమైన సన్నివేశం కూడా ఉండటం విశేషం. ఈ అదనపు ఐదున్నర నిమిషాల సీన్స్ సినిమా ఎమోషన్‌ను, డ్రామాను మరో స్థాయికి తీసుకెళ్తాయని మేకర్స్ చెబుతున్నారు. ఇప్పటికే థియేటర్లలో సందడి చేస్తున్న 'పెద్ది'కి ఈ రీలోడెడ్ వెర్షన్ మరింత బూస్ట్ ఇస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ వంటి పాన్ ఇండియా తారాగణం కీలక పాత్రల్లో మెరిశారు. ఏఆర్ రెహమాన్ సంగీతం, రత్నవేలు సినిమాటోగ్రఫీ సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. ఇప్పటికే మాస్, ఫ్యామిలీ ఆడియెన్స్‌ను ఆకట్టుకున్న 'పెద్ది'.. కొత్త సీన్ల జోడింపుతో బాక్సాఫీస్ వద్ద మరిన్ని రికార్డులు బద్దలు కొడుతుందా అనేది ఆసక్తిగా మారింది. థియేటర్లలో 'పెద్ది' రీలోడెడ్ వెర్షన్‌ను మిస్ అవ్వొద్దని చిత్రయూనిట్ మెగా ఫ్యాన్స్‌కు పిలుపునిచ్చింది.

## పంద్రాగస్ట్‌కు విడుదల కానున్న బట్వారా 1947

బాలీవుడ్ యాక్షన్ స్టార్ సన్నీ డియోల్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ హిస్టారికల్ డ్రామా 'బట్వారా 1947' నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చింది. తాజాగా ఈ సినిమా నుంచి టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. దేశ విభజన నాటి భయానక పరిస్థితులు, ద్వేషం మధ్య ఒక వ్యక్తి చూపించిన అసాధారణ ధైర్యం నేపథ్యంలో సాగే భావోద్వేగభరిత చిత్రంగా ఈ చిత్రం రాబోతున్నట్లు టీజర్‌ను చూస్తే అర్థమవుతుంది. ఇక ఈ చిత్రాన్ని స్వాతంత్ర్య దినోత్సవ కానుకగా ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. గతంలో 'ఘాయల్', 'దామిని', 'ఘాతక్' వంటి ఇండస్ట్రీ హిట్లను అందించిన స్టార్ డైరెక్టర్ రాజ్‌కుమార్ సంతోషి, సన్నీ డియోల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత వస్తున్న సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను మిస్టర్ పర్ఫెక్ట్ ఆమిర్ ఖాన్ తన 'ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండటం విశేషం.




Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com